

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028


లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్గిల్ **విజయ్ దివస్.**




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 210 పేజీలు - 08 వెల - 05/- సోమవారం 27-07-2026


## రోజాకు నోటీసులు.. ఈ నెల 30న విచారణ

- మాజీ మంత్రి రోజాకు పోలీసు నోటీసులు
- రాజకీయ కక్షసాధింపుతోనే తనపై అక్రమ కేసులు పెట్టారన్న రోజా
- 'రెడ్ బుక్ రాజ్యాంగం' అమలు చేస్తున్నారని ప్రభుత్వంపై విమర్శ
- ఆంధ్రజ్యోతి పత్రిక ప్రతులు దహనం చేసినందుకే కేసు అని వెల్లడి



వైసీపీ మహిళా నేత, మాజీ మంత్రి రోజాకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఓ పత్రిక ప్రతులను దహనం చేసిన కేసులో విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. చిత్తూరు జిల్లా నగరిలోని ఆమె నివాసానికి వెళ్లిన తిరుపతి ఈస్ట్ పోలీసులు, ఈ నెల 30న విచారణకు రావాలని నోటీసుల్లో స్పష్టం చేశారు.

మిగతాది 2లో

## బాలకృష్ణను పరామర్శించిన సీఎం..

# ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరా

**ప్రస్తుతం బాలకృష్ణ ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపిన వైద్యులు**



- హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలకృష్ణ
- బావమరిదిని పరామర్శించిన సీఎం చంద్రబాబు నాయుడు
- బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడిన సీఎం
- గత వారం షూటింగ్‌లో మోకాలికి గాయపడటంతో శస్త్రచికిత్స

హైదరాబాద్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను సీఎం చంద్రబాబు నాయుడు ఇవాళ పరామర్శించారు. గత వారం సినిమా షూటింగ్‌లో గాయపడిన బాలకృష్ణకు ఇటీవల మోకాలికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా చంద్రబాబు.. తన బావమరిది అయిన బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన ఎంత వేగంగా కోలుకుంటున్నదీ వాకబు చేశారు. అనంతరం వైద్యులతో ప్రత్యేకంగా మాట్లాడి బాలకృష్ణకు అందిస్తున్న చికిత్స, తదుపరి పునరావాస ప్రణాళికల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 21న రాజమండ్రిలో గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఓ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నప్పుడు బాలకృష్ణ ప్రమాదవశాత్తు గాయపడ్డారు. ఆయన ఎడమ మోకాలికి తీవ్ర గాయం కావడంతో మరుసటి రోజే ఆయన్ను ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు తరలించి ఏఐజీ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షల అనంతరం బాలకృష్ణ ఎడమ కాలి క్వాడ్రిసెప్స్ టెండన్ (తొడ కండరాన్ని మోకాలి చిప్పకు కలిపే కణజాలం) చిరిగిందని, మోకాలికి ఇరువైపులా ఉన్న సహాయక కణజాలాలు కూడా దెబ్బతిన్నాయని వైద్యులు నిర్ధారించారు.

మిగతాది 2లో


## వైఎస్ షర్మిల ఆరోగ్య పరిస్థితిపై నారా లోకేశ్ స్పందన

- పొత్తికడుపు సంబంధిత శస్త్రచికిత్స చేయించుకున్న వైఎస్ షర్మిల
- తాను కోలుకుంటున్నట్లు సోషల్ మీడియాలో వెల్లడి
- షర్మిల ఆరోగ్యంపై స్పందించిన మంత్రి నారా లోకేశ్
- ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ట్వీట్



ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల త్వరగా కోలుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై లోకేశ్ స్పందిస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు.

మిగతాది 2లో



## అఖిలేశ్‌కు అసదుద్దీన్ ఓవైసీ ఓపెన్ ఆఫర్!

- యూపీలో బీజేపీని ఓడించేందుకు ఎస్పీతో పొత్తుకు సిద్ధమన్న అసదుద్దీన్ ఓవైసీ
- ఇప్పుడే చర్చలకు సరైన సమయం, ఎన్నికల తర్వాత బాధపడొద్దని అఖిలేశ్‌కు సూచన
- గౌరవం, న్యాయం కోసమే తమ పోరాటమని, సమానత్వంతోనే పొత్తు ఉంటుందన్న ఓవైసీ
- ఇది ఓటు బ్యాంకు రాజకీయాల కలయిక అంటూ బీజేపీ విమర్శలు

మిగతాది 2లో

## నేడు నుంచి 'ఇంటింటికి తెలుగుదేశం': పల్లా శ్రీనివాసరావు

- ఎన్డీయే రెండేళ్ల పాలన విజయాలపై 45 రోజుల పాటు ప్రచారం
- సూపర్-6 హామీల అమలు తీరును ప్రజలకు వివరించనున్న టీడీపీ
- గత ప్రభుత్వ పాలనతో తేడాలను స్పష్టం చేయాలని శ్రేణులకు పిలుపు
- ప్రజల సమస్యలు, సూచనలు స్వీకరించనున్నట్లు వెల్లడి



ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా, ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ సిద్ధమైంది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సారథ్యంలో 'ఇంటింటికి తెలుగుదేశం' పేరుతో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు

మిగతాది 2లో

## కేంద్ర నూతన విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషి

**విద్యార్థి సంఘాలతో కేంద్ర మంత్రుల చర్చలు సఫలం కావడంతో ఆందోళనల విరమణ**



కేంద్ర విద్యాశాఖ నూతన మంత్రిగా సీనియర్ నేత ప్రహ్లాద్ జోషి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో

- విద్యార్థుల నిరసనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
- నూతన విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషికి అదనపు బాధ్యతలు

ధర్మేంద్ర ప్రధాన్ శనివారం కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయడం తెలిసిందే. ఈ క్రమంలో, కొత్త విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

## విద్యార్థులపై ప్రాణాంతక దాడికి అనుమతిచ్చింది మీరు కాదా?

**: అమిత్ షాకు రాహుల్ గాంధీ ఘాటు లేఖ**

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత వారం విద్యార్థులపై జరిగిన పోలీసు దాడి ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. విద్యార్థులపై జరిగిన ఈ "క్రూరమైన దాడి"కి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఆయన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ఆదివారం ఒక లేఖ రాశారు. ఈ దాడిలో ప్రాణాంతకమైన పెల్లెట్ గన్లను ప్రయోగించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే, జూలై 20న జంతర్ మంతర్ వద్ద "న్యాయమైన, జవాబుదారీతనంతో కూడిన విద్యా వ్యవస్థ" కోసం విద్యార్థులు శాంతియుతంగా నిరసన చేపట్టారని రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు. అయితే, భద్రతా బలగాలు వారిపై విచక్షణారహితంగా బలప్రయోగం చేశాయని ఆరోపించారు. భాష్పవాయువుతో పాటు, ప్రమాదకరమైన పెల్లెట్ గన్లను కూడా వాడారని, ఈ దాడిలో వందలాది మంది

మిగతాది 2లో



- కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లేఖ
- జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై దాడిని ఖండించిన రాహుల్
- శాంతియుత నిరసనపై పెల్లెట్ గన్లు వాడారని తీవ్ర ఆరోపణ
- దాడికి అనుమతి ఎవరు ఇచ్చారో చెప్పాలని లేఖలో డిమాండ్
- మహిళా విద్యార్థినులను లక్ష్యంగా చేసుకున్నారని విమర్శ

## రూ.300 కోట్లతో రైల్వే లైన్ విద్యుద్దీకరణ



- ప్రారంభించిన కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి
- వచ్చే ఏడాది కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభం
- ట్రిపుల్‌ఆర్‌పై త్వరలోనే మోడీ శుభవార్త
- హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

కొమురవెల్లి : తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి మోడీ ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి తెలిపారు. ఆదివారం కొమురవెల్లి పుణ్యక్షేత్రంలో రైల్వే హాల్ట్ స్టేషన్‌ను కిషన్‌రెడ్డి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఇది ఒక చారిత్రాత్మకమైన ఘట్టమన్నారు. రెండేండ్లలో ఈ స్టేషన్‌ను నిర్మించి స్వామి వారి సన్నిధిలో భక్తులకు అంకితం చేస్తున్నామని.. దూర ప్రాంతాల నుంచి స్వామి వారి దర్శనా నికి వచ్చే వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. హైదరాబాద్ నుంచి కేవలం రూ.20తో ఇక్కడికి రావచ్చన్నారు. ప్రస్తుతం డీజిల్‌తో నడుస్తున్న ఈ లైన్‌ను త్వరలోనే రూ.300 కోట్లతో విద్యుద్దీకరిస్తామన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31తేదీ లోగా సిరిసిల్లకు రైలు ప్రారంభిస్తా మన్నారు. వచ్చే ఏడాది వేములవాడ, 2029లోగా కొత్తపల్లి వరకు ఈ రైల్వేలైన్ పనులు పూర్తి చేస్తామన్నారు. హైదరా బాద్ నుంచి యాదాద్రి వరకు రూ.500 కోట్లతో నిర్మించ బోయే ఎంఎంటీఎస్ రైలుకు రాష్ట్ర ప్రభుత్వం త్వరగా భూసేకరణ చేసి ఇవ్వాల న్నారు. రూ.3500 కోట్లతో పాండురంగాపురం, భద్రాచలం పనులు పూర్తి చేయబోతున్నామని,

మిగతాది 2లో

# అఖిలేశ్‌కు అసదుద్దీన్ ఓవైసీ ఓపెన్ ఆఫర్

దేశ రాజకీయాల్లో అత్యంత కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో మరోసారి రాజకీయ సమీకరణాలు వేడెక్కుతున్నాయి. 2027లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్‌కు పొత్తు కోసం బహిరంగ ఆహ్వానం పంపారు. బీజేపీని మరోసారి అధికారంలోకి రాకుండా నిలువరించేందుకు కలిసి పనిచేయడానికి ఇదే సరైన సమయమని ఆయన స్పష్టం చేశారు. మొరాదాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఓవైసీ మాట్లాడుతూ.. "ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడాన్ని మజ్లిస్ కోరుకోవడం లేదు. అందుకే నేను చేతులు కలపడానికి, పొత్తు పెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. మాట్లాడటానికి ఇదే సరైన సమయం. ఎన్నికలు ముగిశాక తర్వాత ఏడవద్దు" అంటూ అఖిలేశ్ యాదవ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తమ పార్టీ పోటీ చేయడం వల్ల ఎస్పీకి నష్టం జరుగుతుందనే వాదనను ప్రస్తావిస్తూ, ఆ నష్టం జరగకుండా ఉండేందుకే తాను పొత్తుకు సిద్ధంగా ఉన్నానని వివరించారు. అయితే, ఈ పొత్తులో తమకు సమాన గౌరవం, హక్కులు కావాలని ఓవైసీ స్పష్టమైన సంకేతాలిచ్చారు. "మా పోరాటం ఏ మతానికి వ్యతిరేకం కాదు. మా గౌరవం, న్యాయం కోసమే ఈ పోరాటం. అఖిలేశ్ యాదవ్ కుర్చీలో కూర్చుంటే, నేను కూడా ఆయన ముందు సమానంగా కూర్చుని హక్కులు, న్యాయం గురించి చర్చిస్తాను" అని ఆయన పేర్కొన్నారు. ఓవైసీ పొత్తు ప్రతిపాదనపై బీజేపీ వెంటనే స్పందించింది. ఇది బుజ్జగింపు రాజకీయాల కలయిక అని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు. "అఖిలేశ్, ఓవైసీ ఇద్దరూ బుజ్జగింపు రాజకీయాల్లో ఒకరితో ఒకరు పోటీ పడతారు. ఇప్పుడు 'పెద్ద భాయిజాన్ ఎవరు' అనే పోటీని పక్కనపెట్టి 'భాయిజాన్ కలయిక' కోసం చూస్తున్నారు. అందుకే ఓవైసీ, అఖిలేశ్‌కు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతున్నారు" అని ఆయన ఎద్దేవా చేశారు. కాగా, యూపీలో యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షంగా సమాజ్‌వాదీ పార్టీ ఉంది. 2027 ఎన్నికలను పార్లమెంట్ ఎన్నికలకు సెమీ ఫైనల్‌గా భావిస్తున్న తరుణంలో ఓవైసీ ప్రతిపాదన ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ ఆఫర్‌పై అఖిలేశ్ యాదవ్ నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు.

# విద్యార్థులపై ప్రాణాంతక దాడికి అనుమతిచ్చింది మీరు కాదా?

వివరాల్లోకి వెళితే, జూలై 20న జంతర్ మంతర్ వద్ద



"న్యాయమైన, జవాబుదారీతనంతో కూడిన విద్యా వ్యవస్థ" కోసం విద్యార్థులు శాంతియుతంగా నిరసన చేపట్టారని రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు. అయితే, భద్రతా బలగాలు వారిపై విచక్షణారహితంగా బలప్రయోగం చేశాయని ఆరోపించారు. భాష్పవాయువుతో పాటు, ప్రమాదకరమైన పెల్లెట్ గన్లను కూడా వాడారని, ఈ దాడిలో వందలాది మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ముఖ్యంగా, మహిళా విద్యార్థినులను లక్ష్యంగా చేసుకుని, వారి సున్నితమైన భాగాలపై దాడి చేశారని తీవ్రంగా ఆరోపించారు. ఈ ఘటనలో 19 ఏళ్ల విద్యార్థి సాహిల్ లోచాబ్ కంటికి పెల్లెట్ తగలడంతో, అతను శాశ్వతంగా కంటిచూపు కోల్పోయే ప్రమాదం ఉందని రాహుల్ తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఉద్దేశించి ఆయన రెండు సూటి ప్రశ్నలు సంధించారు:

1. విద్యార్థులపై పెల్లెట్ గన్ల వంటి ప్రాణాంతక ఆయుధాలను ప్రయోగించడానికి హోం మంత్రిగా మీరు అనుమతి ఇచ్చారా? ఒకవేళ ఇవ్వకపోతే, ఆ అధికారం ఎవరిచ్చారు?
2. సాధారణ దుస్తుల్లో వచ్చి విద్యార్థులను లాఠీలతో కొట్టిన వ్యక్తులు ఎవరు? వారిని రంగంలోకి దించింది ఎవరు?

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాహుల్ డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో దేశవ్యాప్తంగా విద్యార్థి ఆందోళనలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. జంతర్ మంతర్ ఘటనకు అమిత్ షానే ప్రత్యక్ష బాధ్యుడని రాహుల్ గాంధీ గతంలోనే ఆరోపించారు. తాజాగా లేఖ రాయడం ద్వారా ఈ అంశంపై ఒత్తిడిని మరింత పెంచారు. అయితే, రాహుల్ గాంధీ లేఖపై కేంద్ర హోం శాఖ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. శాంతిభద్రతల పరిరక్షణ కోసమే అవసరమైన చర్యలు తీసుకున్నామని ప్రభుత్వ వర్గాలు ఇదివరకే స్పష్టం చేశాయి.

# నేడు నుంచి 'ఇంటింటికి తెలుగుదేశం': పల్లా శ్రీనివాసరావు

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి



రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా, ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ సిద్ధమైంది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సారథ్యంలో 'ఇంటింటికి తెలుగుదేశం' పేరుతో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. రేపు సోమవారం (జులై 27) ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, "ఎన్డీయే ప్రభుత్వ రెండేళ్ల సుపరిపాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతి గడపకూ వివరించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. గత ఏడాది 'సుపరిపాలన తొలి ఏడాది' పేరుతో నిర్వహించిన కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లే, ఈసారి కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనాలి" అని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్-6 హామీల అమలు తీరును, వాటి ద్వారా మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు పొందిన లబ్ధిని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. "గత ప్రభుత్వ విధ్వంసక పాలనకు, ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వ అభివృద్ధి పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో పాటు ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలి" అని పల్లా పేర్కొన్నారు. కేవలం ప్రభుత్వ విజయాలు చెప్పడమే కాకుండా, ప్రజల నుంచి సమస్యలు, సూచనలను స్వీకరించి, వాటి పరిష్కారానికి పార్టీ, ప్రభుత్వం తరఫున కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం, మిత్రపక్షాల సహకారంతో రాష్ట్రం సాధిస్తున్న ప్రగతిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులను ఆయన కోరారు.

## కూటమి పాలనకు రెండేళ్లు: రేపటి నుంచి టీడీపీ ఇంటింటి ప్రచారం...

# నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్.

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రేపటి



నుంచి (సోమవారం) 45 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'డోర్ టు డోర్' కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ ముఖ్యనేతలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ బృహత్ కార్యక్రమంలో అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మంత్రుల నుంచి బూత్ స్థాయి కన్వీనర్ల వరకు పార్టీ యంత్రాంగం మొత్తం ఈ అవుట్ రీచ్ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ప్రజలు కూటమికి చారిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టారని గుర్తుచేశారు. "94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్లతో మనం గెలిచాం. నాటి ప్రభుత్వ విధ్వంసం, ఘోర తప్పిదాల వల్లే 151 సీట్ల పార్టీ 11 సీట్లకు పడిపోయింది" అని ఆయన వ్యాఖ్యానించారు. కూటమి పార్టీల పోరాటాలు, ఎన్నికల వ్యూహాల వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైందని తెలిపారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో ప్రజలకు మరింత చేరువ కావాలని పిలుపునిచ్చారు. "ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఎలాగైతే ప్రతి ఇంటికీ వెళ్లారో, ఇప్పుడు కూడా అదే విధంగా వెళ్లి మనం ఇచ్చిన హామీలను ఎలా అమలు చేస్తున్నామో చెప్పాలి. ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి" అని సూచించారు.

**నాకు కావాల్సింది అనుచరులు కాదు!**

పార్టీలో నాయకత్వ పటిమను పెంచుకోవాల్సిన ఆవశ్యకతను చంద్రబాబు నొక్కిచెప్పారు. "నాకు కావాల్సింది అనుచరులు కాదు, పార్టీకి నాయకులు కావాలి. సమస్యలకు పరిష్కారం చూపే నైపుణ్యాలను అలవర్చుకోవాలి. కష్టంతో కాకుండా ఇష్టంతో పనిచేస్తూ ప్రజలు, కార్యకర్తలతో సన్నిహితంగా మెలగాలి" అని ఆయన హితవు పలికారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదేశించారు. గొడ్డలి పార్టీవిధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని చంద్రబాబు కోరారు. "ఘోర ఓటమి చవిచూసినా ఆ పార్టీ ఇప్పటికీ సమాజంలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోంది. వారి విధ్వంసకర విధానాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. యువతను వారు ఏ విధంగా నిర్వీర్యం చేశారో, యువత భవిత కోసం కూటమి ప్రభుత్వం ఏం చేస్తుందో ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి" అని ఆయన అన్నారు. ప్రజలతో నిరంతరం మమేకమైతేనే ప్రతిపక్ష కుట్రలను ఎండగట్టగలమని స్పష్టం చేశారు. "మళ్లీ కూటమి అధికారంలోకి రావడం ఖాయం, కానీ ఏమరుపాటు వద్దు. రాష్ట్రం కోసం కూటమి ప్రభుత్వం కొనసాగాల్సిన ఆవశ్యకతను ప్రతి ఒక్కరికీ వివరించాలి" అని ఉద్ఘాటించారు. ప్రజల్లో ఉండటాన్ని ప్రతి నాయకుడు బాధ్యతగా స్వీకరించాలని కర్తవ్య బోధ చేశారు.

# తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు...



తిరుమల శ్రీవారి క్షేత్రం భక్తులతో పోటెత్తింది. స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయాయి. క్యూలైన్లు బయటకు విస్తరించి శిలాతోరణం వరకు బారులు తీరిన పరిస్థితి నెలకొంది. ఆదివారం కావడంతో రద్దీ మరింత పెరిగింది. టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులు శ్రీవారిని దర్శించుకోవడానికి సుమారు 20 నుంచి 24 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ యాత్రను ప్రణాళిక చేసుకోవాలని సూచిస్తున్నారు. నిన్న శనివారం (జులై 25) ఒక్కరోజే 84,488 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 37,061 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తుల కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.78 కోట్లు వచ్చినట్టు టీటీడీ తెలిపింది. అదేవిధంగా, నిన్న 4.28 లక్షల లడ్డూలు విక్రయించగా, 2.74 లక్షల మందికి అన్నప్రసాదాన్ని అందించారు. వైద్య శిబిరాల్లో 3,789 మందికి చికిత్స అందించారు.

# రూ.300 కోట్లతో రైల్వే లైన్ విద్యుద్దీకరణ

తెలంగాణలో ఏకకాలంలో 40 రైల్వే స్టేషన్ల అభివృద్ధి జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఐదు వందేభారత్ ట్రైన్లను తెలంగాణకు ఇచ్చిందన్నారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతుందనీ.. వచ్చే ఏడాది దాన్ని ప్రారం భించుకోబోతున్నామన్నారు రూ.5 లక్షల కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు బుల్లెట్ ట్రైన్ల ద్వారా జరుగుతోందని.. తెలంగాణ అభివృద్ధిలో బుల్లెట్ ట్రైన్లు గేమ్ చేంజర్ కాబోతు న్నాయన్నారు. ట్రిపుల్ ఆర్కు సంబంధించి త్వరలోనే మోడీ శుభవార్త అందిస్తారన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. లక్షలాది మంది మల్లన్న భక్తులు అనేక ఏండ్లుగా రైల్వే స్టేషన్ కావాలని కోరినట్లు తెలిపారు. ప్రభు త్వం వారి కోరికను నెరవేర్చిందన్నారు. అంతకుముందు కొము రవెల్లి మల్లన్న ఆలయాన్ని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీలు మాధవనేని రఘునందన్‌రావు, చామల కిరణ్ కుమార్ రెడ్డి, జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు పింగళి శ్రీపాల్ రెడ్డి, అంజిరెడ్డి, రాజ్యసభ సభ్యులు కే.లక్ష్మణ్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ?

# వైఎస్ షర్మిల ఆరోగ్య పరిస్థితిపై నారా లోకేశ్ స్పందన



ఆమె ఆరోగ్య పరిస్థితిపై లోకేశ్ స్పందిస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. షర్మిల వేగంగా కోలుకుంటున్నారని తెలిసి సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. "షర్మిల గారూ, మీరు త్వరగా కోలుకుంటున్నారని తెలిసి సంతోషంగా ఉంది. మీరు సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని కోరుకుంటున్నాను. జాగ్రత్తలు తీసుకోండి" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ మేరకు షర్మిల చేసిన ట్వీట్‌ను ఆయన రీపోస్ట్ చేశారు. ఇటీవల వైఎస్ షర్మిల పొత్తికడుపు సంబంధిత సమస్యతో శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా వెల్లడించారు. "అవసరమైన ఉదర శస్త్రచికిత్స నుంచి నేను బాగా కోలుకుంటున్నానని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. మీ అందరి ప్రార్థనలకు, మద్దతుకు నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ పోస్ట్‌పైనే నారా లోకేశ్ స్పందించి, ఆమెకు ఆరోగ్య పరామర్శ తెలియజేశారు.

# కేంద్ర నూతన విద్యాశాఖ

## మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషి

నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో, 36 రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల



నిరసనలతో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల దృష్ట్యా, తాను ప్రధాని నరేంద్ర మోదీకి రాజీనామా సమర్పించినట్లు ధర్మేంద్ర ప్రధాన్ 'ఎక్స్' వేదికగా నిన్న ప్రకటించారు. ఆయన రాజీనామా చేసిన కాసేపట్లోనే ప్రహ్లాద్ జోషికి ఈ కీలక శాఖను అప్పగించారు. నేడు బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రహ్లాద్ జోషి సోషల్ మీడియాలో స్పందించారు. "కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ఈరోజు బాధ్యతలు స్వీకరించాను. నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు. వినయంతో, కర్తవ్య నిష్ఠతో ఈ బాధ్యతను స్వీకరిస్తున్నాను" అని పేర్కొన్నారు. కర్ణాటకకు చెందిన ప్రహ్లాద్ జోషి, ధార్వాడ్ లోక్‌సభ స్థానం నుంచి ఐదుసార్లు ఎంపీగా గెలుపొందారు. గతంలో పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గు, గనుల శాఖల మంత్రిగా పనిచేశారు. 2024 ఎన్నికల అనంతరం వినియోగదారుల వ్యవహారాలు, పునరుత్పాదక ఇంధన శాఖలను నిర్వహించారు.

## బాలకృష్ణను పరామర్శించిన సీఎం చంద్రబాబు..

# ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరా

దీంతో ఈ నెల 23న వైద్యులు ఆయనకు విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తి చేశారు. దాదాపు మూడు గంటల పాటు జరిగిన ఈ ఆపరేషన్‌లో గాయం చుట్టూ పేరుకుపోయిన రక్తాన్ని తొలగించి, చిరిగిన టెండన్‌ను మోకాలి చిప్పకు తిరిగి అతికించామని, దెబ్బతిన్న కణజాలాలకు మరమ్మతులు చేశామని ఆసుపత్రి వర్గాలు మెడికల్ బులెటిన్‌లో తెలిపాయి. ప్రస్తుతం బాలకృష్ణ ఆరోగ్యం నిలకడగా ఉందని, నిపుణుల బృందం పర్యవేక్షణలో ఉన్నారని పేర్కొన్నాయి.

# రోజాకు నోటీసులు.. ఈ నెల 30న విచారణ



కొన్ని రోజుల క్రితం, తమ పార్టీ నాయకుల కుటుంబాల్లోని మహిళలను కించపరిచేలా ఓ దినపత్రికలో అసత్య కథనాలు ప్రచురించారని ఆరోపిస్తూ రోజా నిరసన తెలిపారు. అందులో భాగంగా పత్రిక ప్రతులను దహనం చేశారు. ఈ ఘటనపై నమోదైన కేసులో భాగంగానే పోలీసులు తాజాగా నోటీసులు అందజేశారు. ఇది రాజకీయ కక్షసాధింపే: రోజా కూటమి ప్రభుత్వం తనపై రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, అందులో భాగంగానే అక్రమ కేసులు బనాయించిందని రోజా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పోలీసులు నోటీసులు అందజేసిన అనంతరం రోజా మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని పక్కనపెట్టి, కూటమి ప్రభుత్వం 'రెడ్ బుక్ రాజ్యాంగాన్ని' అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. వైసీపీ అధినేత జగన్ తో పాటు, పార్టీ నాయకుల కుటుంబాల్లోని మహిళలను కించపరిచేలా ఆంధ్రజ్యోతి పత్రికలో అవాస్తవ కథనాలు ప్రచురించారని, అందుకే నిరసనగా ఆ పత్రిక ప్రతులను దహనం చేశామని స్పష్టం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపితే కేసులు పెట్టడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని రోజా ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు రోజురోజుకూ క్షీణిస్తున్నాయని, మహిళలకు, చిన్నారులకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల భద్రతను గాలికి వదిలేసిన ప్రభుత్వం, కేవలం పేపర్లు దహనం చేసినందుకు తమకు నోటీసులు ఇవ్వడం పక్షపాత వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రజల సమస్యలను పక్కనపెట్టి, ప్రతిపక్ష నేతలపై కేసులు పెట్టడంపైనే ప్రభుత్వం దృష్టి సారించిందని విమర్శించారు. ప్రభుత్వం చేసే తప్పులను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారి గొంతు నొక్కేందుకే ఇలాంటి కక్షపూరిత కేసులు పెడుతున్నారని రోజా అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని గుర్తుచేశారు. ఇటువంటి బెదిరింపులకు, అక్రమ కేసులకు వైసీపీ కార్యకర్తలు, నాయకులు ఎవరూ భయపడరని ఆమె తేల్చి చెప్పారు. తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తమపై బనాయించిన అక్రమ కేసులను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని రోజా డిమాండ్ చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాలను అణచివేయాలని చూడటం మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

## నంద్యాల నియోజకవర్గంలో క్యాన్సర్, సీజనల్ వ్యాధులపై ప్రత్యేక అవగాహన శిబిరాలు: రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్.

● మంత్రి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిసిన జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్స్ (కర్నూలు) ప్రతినిధులు. ● ఆరోగ్య శిబిరాల ఏర్పాటును అభినందించిన మంత్రి ఫరూక్.





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలలో క్యాన్సర్ మరియు ఇతర సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు కర్నూలుకు చెందిన ప్రముఖ జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్స్ ప్రతినిధులు తెలిపారు . ఆదివారం నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ గని హాస్పిటల్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రజల ఆరోగ్యం కోసం తాము చేపట్టబోయే ప్రత్యేక అవగాహన మరియు వైద్య శిబిరాల వివరాలను మంత్రి ఫరూక్ కి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రజలకు ప్రాణాంతక క్యాన్సర్ మహమ్మారితో పాటు, మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల వచ్చే సీజనల్ రోగాల పట్ల అవగాహన కల్పించడం చాలా మంచి పరిణామమని అన్నారు . ఇలాంటి ఉచిత వైద్య అవగాహన శిబిరాలను ఏర్పాటు చేయడం ద్వారా ఎంతోమంది పేద, మధ్యతరగతి ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితిని ముందుగానే తెలుసుకుని, తగిన జాగ్రత్తలు మరియు చికిత్స పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. హాస్పిటల్ యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్స్ ప్రతినిధులు డి.జి.ఎమ్ ఎస్. నదీమ్, మేనేజర్ ఎస్. జకరియా, సీనియర్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పి. చరణ్ , పి4 నంద్యాల ప్రతినిధి చెన్నయ్య, పబ్బతి వేణు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత ఉద్యమ పితామహుడు ప్రగడ కోటయ్య జయంతి ఘనంగా నిర్వహణ.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. చేనేత ఉద్యమ పితామహుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ శాసనసభ్యుడు, మాజీ రాజ్యసభ సభ్యులు దివంగత శ్రీ ప్రగడ కోటయ్య జయంతిని పురస్కరించుకుని జిల్లా రెవెన్యూ అధికారి డి. రామునాయక్ అధ్యక్షతన సోమవారం ఆయన ఛాంబర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ రామునాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని రాష్ట్ర పండుగగా అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం, సహకార సంఘాల అభివృద్ధి, పేదల అభ్యున్నతి, సాగునీటి, మురుగునీటి పారుదల సౌకర్యాల కల్పనలో శ్రీ ప్రగడ కోటయ్య విశేష కృషి చేసిన మహనీయులని అన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొని, అనంతరం ప్రజాప్రతినిధిగా ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. చేనేత రంగాన్ని బలోపేతం చేయడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, చేనేత కార్మికుల కోసం సహకార సంఘాల ఏర్పాటుకు కృషి చేయడంతో పాటు ఏపీసీఓ వంటి సంస్థల అభివృద్ధికి పునాదులు వేసిన గొప్ప నాయకుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. పేదలకు భూముల పంపిణీ, సాగునీటి సదుపాయాల విస్తరణ, విద్యాసంస్థల స్థాపన వంటి అనేక రంగాల్లో ఆయన అందించిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. అనంతరం డీఆర్ఓ దివంగత శ్రీ ప్రగడ కోటయ్య గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొని దివంగత శ్రీ ప్రగడ కోటయ్య కి ఘన నివాళులు అర్పించారు.

## లీకులు పడినా పట్టించుకోరా!

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 26: పైన ఉన్న ఫోటోను చూసి, ఇదేదో మడుగు అని మీరు అనుకుంటే పప్పులో కాలేసినట్లే! బండి ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమీపంలో ఉన్న పైప్ లైన్లకు లీకులు ఏర్పడి ఇది ఓ చెరువుల మారింది. బండి ఆత్మకూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుండి ఎర్రగుంట్ల గ్రామానికి పైపులైన్ల ద్వారా నీరు సరఫరా అవుతూ ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దరిదాపుల్లో పైపులైన్లకు లీకులు పడ్డాయి. దాదాపు నాలుగు నెలల కాలం నుండి లీకులు పడినప్పటికీ పట్టించుకునే నాధులే కరువయ్యారు. నీరు అధికంగా నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ఈ ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా ఈ ప్రాంతాన్ని సందర్శించి లీకులను మరమ్మతు చేయించి ప్రజా ఆరోగ్యానికి కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి ఎన్ఎండి ఫరూక్.

- జామియా మసీద్ కమిటీ కి 50 లక్షలు, సున్ని మసీద్ అభివృద్ధికి 1 లక్ష నిధుల మంజూరు.
- సున్ని మసీదు ప్రహరీ గోడ నిర్మాణానికి హామీ, సొంత నిధుల నుంచి లక్ష రూపాయల ఆర్థిక సాయం.
- మంత్రి ఫరూక్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ లను ఘనంగా సన్మానించిన కమిటీ సభ్యులు.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.





ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి మరియు మసీదులు, ఈద్గాలు, కబరస్థాన్‌ల అభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు . తబ్లిక్ జమాత్ పెద్దలు, జామియా మసీద్ కమిటీ సభ్యులు, సున్ని మసీద్ కమిటీ ప్రతినిధులు మంత్రి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలుసుకొని కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. జామియా మసీద్ కమిటీకి 50 లక్షల రూపాయలు, అలాగే సున్ని మసీద్ అభివృద్ధికి లక్ష రూపాయల నగదును ప్రభుత్వం తరపున మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో సున్ని మసీదుకు కొత్తగా ప్రహరీ గోడ నిర్మించాలని మంత్రి ఫరూక్ ని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. వెంటనే దానికి సంబంధించిన ఎస్టిమేషన్ (అంచనాలు) తయారు చేయించుకుని రావాలని, దానికి అనుగుణంగా నిధులు శాంక్షన్ చేపిస్తానని వాగ్దానం చేశారు. అంతేకాకుండా, ఆ ప్రభుత్వ నిధులు వచ్చేలోపు పనులు ప్రారంభించవచ్చని చెబుతూ, మంత్రి ఫరూక్ తన సొంత నిధుల నుంచి లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని సున్ని మసీదు కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇమాముల సంఘం అధ్యక్షులు అంజద్ భాషా సిద్ధికి మాట్లాడుతూ మంత్రి ఫరూక్ చొరవతో మైనార్టీలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. గతంలో 2019 లో కర్నూలులో జరిగిన ఇస్తెమాకు 10 కోట్ల రూపాయలు, 2025 లో ఆత్మకూరులో జరిగిన ఇస్తెమాకు 3 కోట్ల రూపాయలు, అలాగే ఇటీవల 2026 కడప లో జరిగిన ఇస్తెమాకు అన్ని రకాల వసతుల కోసం గౌరవ ముఖ్యమంత్రి ద్వారా 3 కోట్ల రూపాయల నిధులను మంత్రి ఫరూక్ ఇప్పించారని గుర్తుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న షాదీఖానాలు, మసీదులు, ఈద్గాలు, కబరస్థాన్‌ల అభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వంలోనే భారీగా నిధులు విడుదలయ్యాయని, మైనార్టీలను అన్ని విధాలా ఆదుకునేది కేవలం తెలుగుదేశం పార్టీయేనని అన్నారు .

మైనార్టీల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నందుకు గాను.. మంత్రి ఎన్ఎండి ఫరూక్ కి, అలాగే నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ కి జమాత్ పెద్దలు, కమిటీ సభ్యులు శాలువా కప్పి, పూలదండలతో ఘనంగా సన్మానించి తమ కృతజ్ఞతలు చాటుకున్నారు.

ఈ కార్యక్రమంలో నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాజ్ , తబ్లిక్ జమాత్ పెద్దలు, ఇమాముల సంఘం ప్రతినిధులు, వివిధ మసీదుల కమిటీ సభ్యులు మరియు ముస్లిం మైనార్టీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

## మన్ కీ బాత్' లో నంద్యాల జల సంరక్షణ కార్యక్రమాలకు ప్రధానమంత్రి ప్రశంసలు.

- 'క్యాచ్ ది రైన్' అమలులో దేశానికి ఆదర్శంగా నిలిచిన నంద్యాల జిల్లా.
- జిల్లా బృందం సమిష్టి కృషికి దక్కిన జాతీయ గుర్తింపు - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. భారత



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ప్రసారమైన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో 'క్యాచ్ ది రైన్' ప్రచారం కింద నంద్యాల జిల్లా చేపట్టిన జల సంరక్షణ కార్యక్రమాలను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ప్రశంసించడం జిల్లా యంత్రాంగానికి గర్వకారణమని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. ప్రధానమంత్రి పేర్కొన్నట్లుగా, జిల్లాలో అన్ని గ్రామపంచాయతీల భాగస్వామ్యంతో సంప్రదాయ చెరువుల పునరుద్ధరణ, ఫీడర్ కాలువల పూడికతీత, జల సంరక్షణ నిర్మాణాల బలోపేతం, వర్షపు నీటి సంరక్షణ చర్యలను శాస్త్రీయ ప్రణాళికతో విజయవంతంగా అమలు చేయడం ద్వారా నంద్యాల జిల్లా దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.

జిల్లాలో 2,103 జల సంరక్షణ పనులను వంద శాతం గ్రౌండింగ్ చేసి, 2,691 కిలోమీటర్ల ఫీడర్ కాలువలను పునరుద్ధరించడం, 251 చెరువుల అభివృద్ధి పనులు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 22,221 ఫార్మ్‌పాండ్లు, 2,221 చెక్‌డ్యామ్‌లు, 202 పర్కొలేషన్ ట్యాంకులను బలోపేతం చేయడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం, భూగర్భ జలాల పునరుత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. ఈ చర్యల ఫలితంగా వ్యవసాయం, తాగునీటి భద్రత, గ్రామీణ జీవనోపాధికి దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతున్నాయని కలెక్టర్ తెలిపారు.

ప్రధానమంత్రి ప్రశంసలు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ ప్రతినిధులు, క్షేత్రస్థాయి సిబ్బంది, ప్రజల సమిష్టి కృషికి దక్కిన జాతీయ గుర్తింపని కలెక్టర్ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి జిల్లా ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్.

- కార్గిల్ యుద్ధ వీరులకు సత్కారం.
- ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న సీనియర్ సభ్యులు రవి ప్రకాష్.




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆదివారం కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్గిల్ యుద్ధ వీరులను సత్కరించి, అమరులైన వీర సైనికులకు నివాళు లర్పించారు.

నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ అధ్యక్షతన, కార్యదర్శి మేడా చంద్రశేఖర్, కోశాధికారి సురేష్ ల నిర్వహణలో, సీనియర్ లయన్స్ సభ్యులు జి. రవి ప్రకాష్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న వీర సైనికులు శ్రీనివాసులు, మురళి లనుశాలువా, పూల మాల,జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సేవా సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ పాల్గొని మాట్లాడుతూ 1999 లో కార్గిల్ ప్రాంతాన్ని ఆక్రమించిన పాకిస్తాన్ సైనికుల్ని తరిమికొట్టి భారత ఆధీనంలోకి తెచ్చుకున్న ఈ రోజును కార్గిల్ విజయ దినోత్సవం గా నిర్వహించి, అమరులైన వీర సైనికులకు నివాళులర్పించి వారి త్యాగాలను మననం చేసుకుంటామని అన్నారు. వారి స్ఫూర్తిగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాల్సిన అవసరం ఉందని అన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సందీప్ మాట్లాడుతూ సరిహద్దులలో అహర్నిశలు దేశాన్ని కాపాడుతున్న వీర జవాన్ల త్యాగాలు గుర్తుంచుకుని ,దేశ సమగ్రతను కాపాడడంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధ వీరులు శ్రీనివాసులు,మురళి మాట్లాడుతూ తాము కార్గిల్ యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొన్నామని అయితే ఎందరో వీరుల ప్రాణ త్యాగం వల్లే కార్గిల్ ని మన ఆధీనంలోకి తెచ్చుకోగలిగామని అన్నారు.

ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న రవి ప్రకాష్ మాట్లాడుతూ నంద్యాల లయన్స్ క్లబ్ ప్రతి ఏటా కార్గిల్ విజయ దివస్ రోజున మాజీ సైనికులను ఆహ్వానించి సత్కరించడం ప్రశంసనీయం అన్నారు. ఈ సందర్భంగా రవి ప్రకాష్ తన పుట్టినరోజు పురస్కరించుకుని దివ్యాంగులకు ఒక నెల మందుల పంపిణీ కోసం ఆర్థిక సహకారం అందిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రీజినల్ చైర్మన్ నిజాముద్దీన్, లయన్స్ జిల్లా పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ పీ.వీ.సుధాకర రెడ్డి, జోనల్ చైర్మన్ సోమేశుల నాగరాజు,సీనియర్ లయన్స్ సభ్యులు ఆంజనేయులు గుప్తా, బదిరి శెట్టి శ్రీకాంత్, రమణయ్య, చంద్రమోహన్,రోడ్డా సుంకయ్య,సాయి మనోజ్, రత్నకుమార్, అమిదల జనార్ధన్, చంద్రమోహన్, ఇమ్మడి రామకృష్ణుడు,తోట శ్రీనివాస్, సుహాస్ రాఘవ,రామయ్య పాల్గొన్నారు.

# ఈఎన్‌టీ వైద్య సదస్సుకు ఘనంగా శ్రీకారం




**● శిక్షణ పొందిన ఆరు రాష్ట్రాల నుండి హాజరు అయిన 170 మంది చెవి, ముక్కు,గొంతు వైద్యులు.**

**● కార్య శాలలో శస్త్ర చికిత్సలు చేసిన చెన్నైకి చెందిన ప్రముఖ చెవి, ముక్కు, గొంతు వైద్యులు డాక్టర్ ఆహిలా స్వామీ, డాక్టర్ జయప్రకాశ్ రెడ్డి, డాక్టర్ మధుసూధన రావు, డాక్టర్ మణి దీప్.**

*పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాలలో ఆంధ్రప్రదేశ్ ఈ.ఎన్.టి వైద్యుల సంఘం ఆధ్వర్యంలో,నంద్యాల మధుమణి నర్సింగ్ హోమ్ నిర్వహణలో స్థానిక మధు మణి చెవి,ముక్కు,గొంతు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో శని,ఆది వారాలలో రెండు రోజుల రాష్ట్ర స్థాయి చెవి,ముక్కు, గొంతు వైద్య వైజ్ఞానిక సదస్సు,శస్త్ర చికిత్సల ప్రత్యక్ష ప్రసార శిక్షణా కార్య శాల ( వర్క్ షాప్) నిర్వహించారు.*

మధుమణి నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ మధుసూదనరావు,డాక్టర్ నాగమణి డాక్టర్ మణిదీప్ ల నిర్వహణలో ఏర్పాటు చేసిన ఈ రెండు రోజుల సదస్సు లో ఆంధ్రప్రదేశ్ ఈ ఎన్ టి వైద్యుల సంఘం అధ్యక్షులు డాక్టర్ జయప్రకాశ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్, ఆంధ్ర నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ వేణుగోపాలరెడ్డి, రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ సింగరి ప్రభాకర్, అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వాహక చైర్మన్ డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఈ శస్త్ర చికిత్సల కార్యశాల మరియు సదస్సు నిర్వహిస్తున్నామని ఇది 16 వ సదస్సు అన్నారు.పలు రాష్ట్రాల నుండి చెవి ముక్కు గొంతు వైద్యులు నంద్యాలకు ఆధునిక శస్త్ర చికిత్సల శిక్షణ కోసం రావడం నంద్యాలకు గర్వకారణం అన్నారు.నిర్వాహక కార్యదర్శి డాక్టర్ మణిదీప్ మాట్లాడుతూ ఈ రెండు రోజుల సదస్సులో ఆరు రాష్ట్రాల నుండి 170 మంది చెవి, ముక్కు, గొంతు వైద్యులు ప్రతినిధులుగా పాల్గొని మధు మణి సమావేశ భవనంలో స్క్రీన్ పైన, ఆసుపత్రి ఆపరేషన్ థియేటర్లో జరుగుతున్న శస్త్ర చికిత్సల ప్రత్యక్ష ప్రసారం తిలకిస్తూ ఆపరేషన్ చేస్తున్న వైద్యునితో తమ సందేహాలు నివృత్తి చేసుకుని శిక్షణ పొందుతారని తెలిపారు.

*డాక్టర్ అహిలా స్వామి,డాక్టర్ జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి వైజ్ఞానిక సదస్సులు యువ వైద్యులకి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు భవిష్యత్తులో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి దోహదపడుతుందని అన్నారు. ఆదివారం జరిగిన సదస్సు ముగింపు కార్యక్రమంలో ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు,రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే యువ వైద్యులు నిరంతరం ఆధునిక విధానాలను నేర్చుకుని నైపుణ్యాలను పెంచు కోవలసిన అవసరం ఉందని అన్నారు.*

**డాక్టర్ సింగరి ప్రభాకర్ మాట్లాడుతూ వైద్య రంగంలో అనునిత్యం గణనీయమైన మార్పులు ప్రపంచవ్యాప్తంగా జరుగుతూ ఉంటాయని, వాటిని తెలుసుకోవడం కోసం వైద్యులు నిరంతర అధ్యయనం చేయడం చాలా అవసరం అన్నారు.**

జాతీయస్థాయి ప్రముఖ చెవి ముక్కు గొంతు చికిత్స నిపుణులు డాక్టర్ అహిలా స్వామి, డాక్టర్ జయప్రకాశ్ రెడ్డి,డాక్టర్ మధుసూదన రావు, మధుమణి ఆసుపత్రి చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్స నిపుణులు మణిదీప్ కలసి రెండు రోజులలో 20 శస్త్ర చికిత్సలు చేస్తూ యువ వైద్యులకు మెళకువలు వివరించారు. ఆపరేషన్లకు అవసరమైన క్లిష్టమైన అనస్తీసియా ప్రక్రియ ప్రముఖ వైద్యులు డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మాధవి, డాక్టర్ వంశీ నిర్వహించారు.



డాక్టర్ అహిలా స్వామి, డాక్టర్ జయప్రకాశ్ రెడ్డి లను డాక్టర్ మధుసూదన రావు కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు.

సదస్సు ప్రారంభ, ముగింపు కార్యక్రమాలలో డాక్టర్ నాగమణి,సదస్సు నిర్వాహక కార్యదర్శి డాక్టర్ మణిదీప్, కోఆర్డినేటర్ డాక్టర్ రోహిత్, డాక్టర్ లోచన రెడ్డి,మధుమణి కుటుంబ సభ్యులు డాక్టర్ మధుప్రీతి,ప్రణీత్, సింధు,వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన 170 మంది చెవి ముక్కు గొంతు వైద్యులు పాల్గొన్నారు.

# వేటగాళ్లపై ఉచ్చు బిగిస్తున్న అటవీశాఖ

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 26 : నల్లమల అడవి ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులపై అటవీశాఖ ఉచ్చు బిగిస్తూ ఉంది. ప్రత్యేకించి మూగ జీవాల విషయంలో వేటగాళ్లు ప్రవర్తిస్తున్న తీరుపై వారి పట్ల ప్రత్యేక నిఘా ఉంచి వారిని వేటాడే పనిలో పడుతూ ఉంది. వేటగాళ్లను వేటాడే పనితో పాటు, అటవీ ప్రాంతంలో నల్లమల అడవి సంపదను దోచుకొని సొమ్ము చేసుకునే వ్యక్తుల పట్ల కూడా ప్రత్యేక నిఘా సారించి వారి ఆగడాలకు కళ్లెం వేసే ప్రయత్నాలలో ఉంది. నంద్యాల టైగర్ ప్రాజెక్టుకు డిప్యూటీ డైరెక్టర్ గా కొద్ది కాలం క్రితమే పదవి బాధ్యతలు చేపట్టిన డాక్టర్ చైతన్య కుమార్ రెడ్డి అటవీ సిబ్బందిని అప్రమత్తం చేసి అటవీ సంపదను పరిరక్షించే పనిలో పడ్డారు. అటవీ సంపద పరిరక్షణ విషయంలో సిబ్బందికి పూర్తి హక్కులు కల్పిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు. సంపద పరిరక్షణ విషయంలో ఎట్టి వారైనా సరే వదల వద్దంటూ ఆదేశాలు ఇస్తూనే, సిబ్బందికి నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్నారు. నెల రోజుల క్రితం మహానంది మండలంలో బుక్కాపురం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు అడవి పిల్లి, అడవి పందుల మాంసాన్ని విక్రయిస్తున్న కేసులో అరెస్టు చేసి వారిని రిమాండ్కు సాగనంపి జై లు ఊచలు పెట్టిస్తున్నారు. చలమ ప్రాంతంలో ఉడుములను వేటాడిన కేసులో నిందితులను అరెస్టు చేయించారు. పది రోజుల క్రితం బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న నారాయణపురం గ్రామానికి సమీపంలో ఒక బో లేరో వాహనంలో లక్ష రూపాయలు విలువ చేసే నానా జాతికి చెందిన కలపను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి డ్రైవర్ను అరెస్టు చేశారు. పారిపోయిన ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. తాజాగా రిజర్వుడు ఫారెస్ట్ ఏరియాలో తైలం ప్లాంటేషన్ నందు చిన్నదేవలాపురం గ్రామానికి చెందిన సుబ్బారావు అనే వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుంటే అటవీశాఖ సిబ్బంది పట్టుకున్నారు. నిందితుడిని పట్టుకొని అతని వద్ద ఉన్న సంచిని పరిశీలిస్తే అందులో 3 ఉడుములు ఉన్నట్టుగా గుర్తించారు. వాటిలో ఒకటి చనిపోగా మిగతా రెండు ఉడుములను అటవీ ప్రాంతంలో వదిలివేశారు. చనిపోయిన ఉడుముకు పోస్టుమార్టం నిమిత్తమై అటవీ శాఖ కార్యాలయం వద్ద పశువైద్యాధికారి చేత పోస్టుమార్టం చేయించి అక్కడే దానం చేశారు ఈ కేసుకు ఉపయోగించిన ద్విచక్ర వాహనం ఏపీ 22 పి 12 52 నెంబర్ గల వాహనాన్ని జప్తు చేశారు ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్కు సాగనంపారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్ ఝా , ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు కాశీం నాయక్,నాగరాజు, నాగేంద్రయ్య, ఎన్జీవో శ్రీధర్, హైటికస్,మొబైల్ పార్టీ రాజేష్ ఫక్రుద్దీన్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ తో పాటు ప్రొటెక్షన్ వాచర్లు కిరణ్ ఉస్మాన్లు పాల్గొన్నారు.







**డిప్యూటీ డైరెక్టర్ రాకతో అటవీ శాఖ సిబ్బందిలో ఉత్సాహం**

నంద్యాల టైగర్ ప్రాజెక్టుకు డిప్యూటీ డైరెక్టర్ గా చైతన్య కుమార్ రెడ్డి రావడంతో అటవీశాఖ సిబ్బందిలో ఉత్సాహం వెల్లివిరుస్తోంది. విధి నిర్వహణలో నిక్కచ్చిగా నిజాయితీగా వ్యవహరించే డిప్యూటీ డైరెక్టర్ చైతన్య కుమార్ రెడ్డి కొద్దిరోజుల క్రితమే పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో నంద్యాల జిల్లాలో విధి నిర్వహణలో నిజాయితీగా వ్యవహరించే ఉన్నతాధికారి కొద్ది కాలం క్రితం బదిలీ కావడంతో అటవీశాఖ అధికారులు కొంతకాలం పాటు నిరుత్సాహానికి గురయ్యారు. నిజాయితీపరుడైన ఓ ఉన్నతాధికారి బదిలీ కావడం అటవి వర్గాల్లో ఆందోళన కలిగించగా, సంపదను దోచుకునే వ్యక్తులకు ఆనందాన్ని కలిగించింది. ప్రస్తుతం డి డీ చైతన్యకుమార్ రెడ్డి రావడంతో, అటవీ శాఖ సిబ్బంది లో ఉత్సాహం మళ్లీ మొదలైంది. అటవీ సంపద పరిరక్షణ విషయంలో డిప్యూటీ డైరెక్టర్ సహకారంతో ఆదేశాలతో, విధి నిర్వహణకు కోరుకుంటున్నారు. అటవీ ప్రాంతంలో అక్రమంగా కలపను నరికి తరలించడం వన్యప్రాణులను వేటాడడం అటవీ భూములను సాగు చేయడం పూర్తిగా నిషేధం అంటూ అటవీశాఖ సిబ్బంది పేర్కొంటున్నారు. అనుమతి లేకుండా అటవీ ప్రాంతానికి వెళ్లడం కూడా నేరంగా పరిగణిస్తామని పేర్కొంటున్నారు. అక్రమంగా చెట్లను నరికితే 6 నెలల పాటు ఏడు శిక్ష జరిమాణాలు ఉంటాయని, 1972 వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద, వన్యప్రాణులను వేటాడితే మూడు నుండి ఏడు నెలలు జైలు శిక్షతో పాటు, జరిమాణాలు కూడా విధించడం జరుగుతుందని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

# ఈ నెల 27న జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి, ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ఈ నెల 27వ తేదీ (సోమవారం) జిల్లా వ్యాప్తంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్)" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందని తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులు వాటి పరిష్కారానికి చర్యలు చేపడతారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను నేరుగా కార్యక్రమంలో సమర్పించవచ్చని, అలాగే ఎవవనిశీఖఎ.ఖజా.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. అర్జీదారులు తమ సమస్యలకు సంబంధించిన వినతులను ముందుగా మండల, రెవెన్యూ డివిజన్ లేదా మున్సిపల్ స్థాయి కార్యాలయాల్లో సమర్పించి, అక్కడ పరిష్కారం కాని అంశాలను మాత్రమే జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 10.00 గంటలకు ప్రారంభమయ్యే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# చేనేత ఉద్యమ నేతకు ఘన నివాళి

**- కర్నూలు కమిషనర్ చల్లా ఓబులేసు నివాళులర్పణ**



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : భారత స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ రాజకీయ నాయకుడు, ఆంధ్రప్రదేశ్‌లో చేనేత ఉద్యమానికి ప్రధాన నాయకుడైన కీ.శే. ప్రగడ కోటయ్య జయంతిని పురస్కరించుకొని నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పూలమాల వేసి నివాళు లర్పించారు. చేనేత కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ప్రగడ కోటయ్య చేసిన విశిష్ట సేవలు చిరస్మరణీయమని కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. చేనేత రంగ అభ్యున్నతికి ఆయన అందించిన సేవలను గుర్తిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జునైద్, ఆర్వో క్రిస్టోఫర్, ఆర్‌లు జి.ఎం. శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్ నూర్ ఆహ్మద్, ఉద్యోగులు పాల్గొని ప్రగడ కోటయ్యకి నివాళులర్పించారు.

# జిల్లావ్యాప్తంగా రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

**☛నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సమాజంలో మంచి పౌరులుగా మెలగాలి.**





పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు జిల్లాలో నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు వారి పోలీస్ స్టేషన్ల పరిధిలో నివసిస్తున్న రౌడీ షీటర్లకు ,నేరచరిత్ర గలవారికి ,చెడు నడత కలిగిన వ్యక్తులకు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ప్రస్తుతం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్న రాదని మీపై నిరంతరం నిఘా ఉంటుందని,పోలీసుల మాటలను వినకుండా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్, బైండోవర్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

## నేడు సోమవారం నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

- కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరపాలక సంస్థలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:00 గంటలకు స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నగరపాలకకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరు అవుతారని, కాలనీల్లోని మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి వెలుగులు, పరిశుభ్రత వంటి సమస్యలను ప్రజలు లిఖిత పూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు.ప్రతి ఫిర్యాదు స్వీకరించబడిన వెంటనే సంబంధిత అధికారులకు పంపి, పరిష్కారం కోసం నిర్దిష్ట గడువులు నిర్ణయించబడతాయని ఆయన వెల్లడించారు. అదేవిధంగా, ప్రతి ఫిర్యాదు పురోగతిని పౌరులు స్వయంగా https://Meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని కమిషనర్ వివరించారు.నేడు సోమవారం నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం: ఏఎస్పీ సుస్మిత

మహానంది, పల్లె వెలుగు రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా తనిఖీలు చేపట్టినట్లు నంద్యాల ఏఎస్పీ సుస్మిత పేర్కొన్నారు. శనివారం అర్ధరాత్రి మహానంది మండల పరిధిలోని



ఆంజనేయపురం చెక్‌పోస్ట్ నంద్యాల- గిద్దలూరు రహదారిపై స్పెషల్ డ్రైవ్ లో భాగంగా తనిఖీలు చేపట్టారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రజల భద్రతను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు తెలిపారు.ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వాహనాలను అతివేగంగా నడపకూడదని, రాంగ్ రూట్‌లో ప్రయాణించకూడదని డ్రైవర్లకు సూచించారు.నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎస్పీ వెంట నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాసులు రెడ్డి, మహానంది ఎస్సై ఎన్.రామ్మోహన్ రెడ్డి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నంద్యాల జిల్లాలో విద్యా విజయాలకు న్యూక్లియస్ జూనియర్ కాలేజ్ చిరునామా




నంద్యాల, జూలై 25: నంద్యాల జిల్లాలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ, నీట్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దుతున్న విద్యాసంస్థగా న్యూక్లియస్ జూనియర్ కాలేజ్ నిలుస్తోందని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. జేఈఈ మెయిన్స్‌లో ఎం. మౌనిక 720 మార్కులకు 561, కె. నిర్వాంత్ కుమార్ 526, సి. సునందిత 486, కె. భరత్ 457 మార్కులు సాధించి కళాశాలకు పేరు తీసుకొచ్చారు. అదేవిధంగా పలువురు విద్యార్థులు ఐఐటీ ధారవాడ్, ఎన్ఐటీ అగర్తలా, ఐఐఐటీ కొట్టాయం తదితర ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధించి కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, క్రమశిక్షణ, నిరంతర పరీక్షలు, వ్యక్తిగత శ్రద్ధ, ప్రత్యేక శిక్షణతో విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల విజయాలకు తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకుల కృషి ప్రధాన కారణమని తెలిపారు. విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు కొనసాగుతున్నాయని, ఐఐటీ, నీట్ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కళాశాల యాజమాన్యం కోరింది.

## మంచి నడవడికతో జీవించాలి: ఎస్సై



మహానంది, పల్లె వెలుగు రౌడీ షీటర్లు సమాజంలో మంచి నడవడికతో జీవించాలని మహానంది ఎస్ఐ ఎన్. రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మహానంది పోలీస్ స్టేషన్లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు.అనంతరం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు. ఎస్ఐ మాట్లాడుతూ.. రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగకుండా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు..అల్లర్లు, అలజడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు..చెడు నడత కలిగిన రౌడీ షీటర్లపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు.

# కంచే చేసుని మేస్తే

- నలుగురు అటవీ సిబ్బంది సస్పెన్షన్



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 26: పంట రక్షణ కోసం పొలం చుట్టూ కంచే వేసుకుంటే, కంచే చేనును మేసిందన్నట్టు గా మారింది అటవీ సిబ్బంది పరిస్థితి. అటవీ సంపద పరిరక్షణ విషయంలో చర్యలు చేపట్టాల్సిన సిబ్బంది కొందరు అటవీ స్మగ్లర్లతో కుమ్మక్కై అక్రమార్జనకు పాల్పడ్డారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వెలుగోడు లో నలుగురు అటవీశాఖకు చెందిన సిబ్బంది సస్పెన్షన్కు గురయ్యారు. వెలుగోడు అటవీ రేంజి పరిధిలోని అప్పిరాజు కుంట సెక్షన్లు కొందరు అటవీ స్మగ్లర్లు విలువైన టేకు చెట్లను నరకి వేసి రహస్య ప్రాంతాల్లో దాచి ఉంచారు. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు టేకు కలపను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న కలపను ప్రభుత్వ డిపో తరలించాల్సింది పోయి, స్మగ్లర్లతో లాలూచీ పడి వారితో చేతులు కలిపారు. అటవీ సిబ్బంది తమ ఫారెస్ట్ డిపోకు చెందిన ట్రాక్టర్ లోనే టేకు కలపను వెలుగోడు మండలంలోని మోత్కూరు గ్రామంలో ఉన్న ఒక ప్రైవేటు డిపోకు రాత్రికి రాత్రే రహస్యంగా తరలించారు. ఈ వ్యవహారం అంతా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో తక్షణమే వారు స్పందించారు. ఆత్మకూరు అటవీ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అప్పో ఒక ఫారెస్ట్ అధికారి చేత రహస్యంగా విచారణ జరిపించారు. విచారణలో టేకు కలప తరలింపు విషయంలో నలుగురికి ఇబ్బంది పాత్ర ఉందన్న విషయాన్ని గుర్తించారు. ఈ సంఘటనకు సంబంధించి వెలుగోడు ఫారెస్ట్ ఇన్చార్జి రేంజర్ తాహిర్ తోపాటు ఓ సెక్షన్ ఆఫీసర్, మరో ఇద్దరు సిబ్బందిని సస్పెండ్ చేస్తూ డిప్యూటీ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అటవీ సిబ్బందిని సస్పెండ్ చేసిన విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచారు. ఈ విషయం ప్రజలకు తెలిసిపోతే తమ పరువు పోతుందని అటవీ అధికారులు ఈ విషయంలో జాగ్రత్త పడ్డారు. సస్పెన్షన్కు గురైన ఇన్చార్జి రేంజర్ తాహిర్ మరో నెల రోజుల్లో పదోన్నతి పొందే పరిస్థితులలో సస్పెండ్ కు గురి కావడం కొసమెరుపు.

## జులై 30 తేదీన జరుగు చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి.

పల్లెవెలుగు బేతంచెర్ల ప్రతినిధి (జులై 26):-- ఆదివారం నాడు గోడపత్రికలను విడుదల



కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలను అమలు చేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఈనెల 30వ తేదీ జరుగుతున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య, పట్టణ ఉపాధ్యక్షులు బి రామాంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయము నందు సిఐటియు నాయకులు ఎస్ గుల్జార్ బి ఆధ్వర్యంలో చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల పట్ల, కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరిని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని వారు కోరారు. సంఘటిత అసంఘటిత కార్మిక రంగాల్లో పనులు చేస్తున్న కార్మికులందరికీ షరతులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని అన్నారు. 71 షెడ్యూల్ ప్రకారము కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని కార్మికులు పనిచేస్తున్న ప్రదేశాలలో భద్రత మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. అంగన్వాడి ఆశ మధ్యాహ్నం భోజనం వెలుగు 108 104 ఆరోగ్యశ్రీ తదితర రంగాలలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడిని ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ లో పనిచేయు కార్మికులందరికీ టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. అంతేకాకుండా కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోర్డు లను రద్దు చేయాలని కోరారు. ఈనెల 30వ తేదీ తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యాలయం ముట్టడికి కార్మికులందరూ సంఘటితమై అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి వేణుగోపాల్, అంగన్వాడీ నాయకురాలు ఎస్ గురుజార్చి, జై శ్రీనివాసులు విష్ణు నారాయణ , వెంకట్ రాముడు, భాస్కర్, గోరంట్ల, టింగు, నాగరాజు, రూల్స్ మద్దిలేటి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

---

# నంద్యాలలో 'యముడు' చిత్ర బృందం సందడి.

సినిమా సూపర్ హిట్ కావాలన్న మంత్రి ఫరూక్.







పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రేక్షకుల ముందుకు రాబోతున్న 'యముడు' చిత్ర బృందం నంద్యాల జిల్లా కేంద్రంలో సందడి చేసింది. సినిమా ప్రమోషన్స్ లో భాగంగా చిత్ర యూనిట్.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తో మరియు నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తో ప్రత్యేకంగా సమావేశమైంది. అనంతరం చిత్రానికి సంబంధించిన టీజర్ ను వారు విడుదల చేశారు ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మూవీ టీంతో కాసేపు ఆత్మీయంగా ముచ్చటించి, సినిమాకు సంబంధించిన విశేషాలను అడిగి తెలుసుకున్నారు.
అనంతరం మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఆగస్టు 7వ తేదీన విడుదల కాబోతున్న 'యముడు' చిత్రం ఘన విజయం సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని తెరకెక్కించారని . వారి కష్టానికి తగిన ప్రతిఫలం ఖచ్చితంగా దక్కుతుందని అన్నారు . ఈ సినిమా ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుందని, బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ కొట్టాలని కోరుకుంటున్నాను. మన రాయలసీమ బిడ్డ, ఈ చిత్ర హీరో, దర్శక-నిర్మాత జగద్ తో పాటు చిత్ర యూనిట్ సభ్యులందరికీ నా ముందస్తు శుభాకాంక్షలు" అని తెలిపారు.
మంత్రి ఆత్మీయ పలకరింపు, ప్రోత్సాహం పట్ల 'యముడు' చిత్ర బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. ఆయన అందించిన మద్దతు తమలో ఎంతో ఉత్సాహాన్ని నింపిందని చిత్ర యూనిట్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. భారీ అంచనాల నడుమ ఆగస్టు 7న థియేటర్లలోకి వస్తున్న ఈ 'యముడు' సినిమాను ప్రేక్షకులందరూ ఆదరించి, పెద్ద హిట్ చేయాలని చిత్ర బృందం ఈ సందర్భంగా కోరింది.

## చేర్యాలలో ఘనంగా ముగిసిన బొడ్రాయి బోనాల మహోత్సవం

**భక్తుల రద్దీతో సందడిగా ముగింపు వేడుకలు**



చేర్యాల, జూలై 26 (పల్లె వెలుగు దినపత్రిక): మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కీసర మండలంలోని చేర్యాల గ్రామంలో నిర్వహించిన శ్రీ బొడ్రాయి బోనాల మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా ముగిసింది. మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో కొనసాగిన ఈ ఉత్సవాల్లో గ్రామస్థులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగింపు రోజున గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. సంప్రదాయ వాయిద్యాల నడుమ మహిళలు రంగురంగుల బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, డప్పు కళాకారుల ప్రదర్శనలు, సాంప్రదాయ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు సమన్వయంతో ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. భక్తులకు తాగునీరు, అన్నప్రసాదం, ఇతర సౌకర్యాలు కల్పించారు. బొడ్రాయి బోనాల మహోత్సవం విజయవంతంగా ముగియడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ ఐక్యతకు, సాంప్రదాయ సంస్కృతి పరిరక్షణకు ఈ ఉత్సవాలు ప్రతీకగా నిలిచాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# పలకరింపు.. మనిషి మంచితనానికి ఆలంబన



పల్లె వెలుగు : పలకరింపు మనిషికి ఉన్న గొప్ప వరం. అది మానవీయ సంబంధాలకు వారధి. మానసిక ఆందోళనను పారద్రోలే మంత్రం. పలకరింపు మదిలో గొప్ప పులకరింపును కలిగిస్తుంది. ఒక్క పలకరింపుతోనే ఉత్సాహం, ఉల్లాసం ఉరకలు వేస్తాయి. ఆనందం వికసించి, ఆందోళన దూరమవుతుంది. ఆత్మీయత, అనుబంధాలు, అనురాగాలు, అభిమానాలు బలపడతాయి. ఒక్క పలకరింపుతో మనసులో నూతనోత్తేజం మేల్కొంటుంది. పలకరింపు మంచితనానికి, మనిషితనానికి నిదర్శనం. ఆధునిక మానవుడు ప్రపంచీకరణ ఉచ్చులో చిక్కుకొని, భౌతిక విలాస జీవనశైలిలో పలకరింపును మరిచిపోయాడు. మనిషిని మనిషిగా చూసే సోయిని కోల్పోయాడు. ఆప్తులకు దూరమై, ఆందోళనలకు దగ్గరై, అనారోగ్యమే ఆస్తిగా, మానసిక కుంగుబాటే సంపదగా, సమస్యలే తన సౌభాగ్యంగా భావించే పరిస్థితి ఏర్పడింది. డబ్బులు పోసినా మార్కెట్లో దొరకని అమూల్య సంపద పలకరింపు. ఒక పలకరింపుతో ఒక ప్రాణాన్ని నిలబెట్టవచ్చు. ఒక బాధను తొలగించవచ్చు. ప్రేమను రేకెత్తించవచ్చు. ఆశను చిగురింపజేయవచ్చు. మనసులోని గాయాలను మాన్పవచ్చు. నేడు పలకరింపు, పట్టింపు లేకపోవడం వృద్ధుల పాలిట శాపంగా మారింది. “వృద్ధులు వద్దు.. ఆస్తులు ముద్దు” అనే ధోరణితో కొందరు పెద్దలను కాలం చెల్లిన పరికరాలుగా భావిస్తున్నారు. వృద్ధులను, పెద్దలను ఆప్యాయంగా పలకరించాలి. మన పలకరింపులు పెద్దలకు ఆరోగ్యాన్ని అందించే మందుల్లా పనిచేస్తాయి. పలకరింపుతో స్నేహం, బంధం, ప్రేమ, అనుబంధం పెరుగుతాయి. ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడు పలకరించే వారు చాలామంది ఉంటారు. కానీ పలకరింపుకు ఆస్తులు, అంతస్తులు, హోదాలు అర్హతలు కావు. మమకారం, మానవీయత పరిమళించే పలకరింపులే నిజమైన పలకరింపులు. పలకరింపుకు నోచుకోలేక కొందరు వృద్ధులు వృద్ధాశ్రమాలను చేరుతున్నారు. అందరూ ఉన్నప్పటికీ అనాథలుగా జీవితాన్ని గడుపుతున్నారు. ఇంట్లో అందరూ ఉన్నా వారి మధ్య దూరాలు తగ్గడం లేదు.. మరింత పెరుగుతూనే ఉన్నాయి. ఎవరి చేతుల్లో వారు సెల్‌ఫోన్లు, ఇయర్‌ఫోన్లతో బంధీలై తమలో తామే, తమకు తామే జీవితం గడుపుతున్నారు. సాంకేతికత మనుషుల మధ్య దూరాలను పెంచింది. బంధువుల మధ్య కూడా దూరాలు పెరుగుతున్నాయి. పలకరింపులు లేకపోవడంతో మనసులో దాగిన భావాలు, బాధలు తెలియక మానసిక కుంగుబాటు నెలకొంటుంది. పలకరింపుతో అపోహలు తొలగిపోతాయి. పలకరింపు ప్రగతిశీలతకు ఆలంబన. సృజనకు శ్రీకారం. పక్కన ఉన్నవారిని, దూరంగా ఉన్న మిత్రులను ఖాళీ సమయం దొరికినప్పుడల్లా ఒకసారి పలకరించండి. గతకాలపు మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకొని మనసారా పలకరించండి.పలకరింపు మనిషి మంచితనానికి ఆనవాలు.. మనశ్శాంతికి ఆలంబన.-- నేదునూరి కనకయ్యఅధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం కాలమిస్ట్, కరీంనగర్

# ఆదోని జిల్లా సాధన అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం



ఆదోని జిల్లా సాధన అభివృద్ధి కమిటీ వైస్ ప్రెసిడెంట్ దస్తగిరి నాయుడు.

ఆదోని (పల్లె వెలుగు): 25-7-2026వ తేదీ శనివారం రోజు, ఆలూరు నియోజకవర్గం ఆస్పరి మండలము ఆస్పరి నందు ఏర్పాటు చేసినటువంటి, సంజీవని ప్రోగ్రాం,ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజలకు వైద్య సేవలు చేరువలో ఉండే విధంగా స్వయంగా ముఖ్యమంత్రి చేతుల మీదనే సంజీవనీ ప్రారంభించడం జరిగింది. ఈ ప్రోగ్రాంనకు ఆదోని జిల్లా సాధన అభివృద్ధి కమిటీ నాయకులు వినతిపత్రం ఇవ్వడానికి బయలుదేరడం జరిగింది. కానీ అక్కడ పోలీస్ అధికారులు అడ్డుకొని, అవకాశం ఇవ్వలేదు మేము ఏం చేయలేని పరిస్థితిలో అక్కడ ఏర్పాటు చేసినటువంటి గ్రీవెన్స్ అనగా ప్రజా సమస్యల వేదిక యందు వినతి పత్రం ఇచ్చి సీ.యం.వో ఆఫీస్ పంపాలని కోరడమైనది. వాళ్లు వెంటనే పీ.జి.ఆర్.ఎస్ లో అప్లోడ్ చేసి పంపడమైనది. ఈ కార్యక్రమంలో కుంకనూర్ వీరేష్ ,అయ్యాలప్ప, దస్తగిరి నాయుడు పాల్గొనడం జ రి గి ం ది . మన ముఖ్యమంత్రి, సభలోసంక్షేమ పథకాలు అయితేనేమి, అభివృద్ధి పనులు అయితేనేమి , మరియు నిధులు అయితేనేమి ప్రజల సమక్షంలో రివ్యూ కూడా ఏర్పాటు చేయడమైనది.కానీ ఆదోని జిల్లాని మాత్రం ప్రకటించలేదు. అదే సందర్భంగా ఆలూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి వైకుంఠము జ్యోతి గారు, ఆలూరు నియోజకవర్గం లో ఉన్నటువంటి సమస్యలపై చాలా చక్కగా వివరించారు, అలాగే వాల్మీకుల చిరకాల వాంఛ అయినటువంటి ఎస్టీ రిజర్వేషన్ గురించి, అలాగే మాదాసి కురువ మదారి కురువ ,ఎస్సి రిజర్వేషన్ గురించి, ప్రజల సమక్షంలో ముఖ్యమంత్రి తెలపడం అయినది. ఈ విషయంలో వైకుంఠం జ్యోతి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. అందులోనే ఆదోని జిల్లా ప్రస్తావన కూడా అందరిసమక్షం లో అడిగి ఉంటే బాగుండేది. జిల్లా పైన కూడా స్పష్టమైన ప్రకటన వచ్చేది.కనీసం అక్కడ ఉన్నటువంటి కూటమి నాయకులు ఆదోని జిల్లా పైన ఏ విషయం చెప్పలేదు. ఆదోని జిల్లా రాకపోవడానికి ముఖ్య కారణము, ఈ ఐదు తాలూకాలో ఉన్నటువంటి కూటమి నాయకులు, మరియు మంత్రి టీజీ భరత్ కారణము.కాబట్టి కూటమి నాయకులందరికీ రేపు స్థానిక ఎలక్షన్లలోపూ ఆదోని జిల్లా ప్రకటించకపోతే స్థానిక ఎన్నికల్లో కచ్చితంగా గుణపాఠం చెప్తామని తెలపడం అయినది.

# గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు

## కురుబ కురుమ కురువ కమిటీలు విజయవంతం.

రాష్ట్రంలో యువతలను చైతన్యం చేస్తున్న రాష్ట్ర కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప





ఆదోని (పల్లె వెలుగు): ఆంధ్ర రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పార్టీ కోసం నిరంతర ప్రజల సేవ చేస్తున్న మన కురుబ మాన్వి దేవేంద్రప్ప గుర్తించి రాష్ట్రంలో కురుబ-కురుమ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చినారు. ఈ పదవికి నిరంతరం ప్రజలకు మరియు యువతలకు చైతన్యం నింపుతూ ముందుకు సాగుతున్నారు, రాష్ట్ర బీసీ మంత్రి సవితమ్మ, కర్నూల్ ఎంపీ బస్తిపాటి నాగరాజుగారు, చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప మరియు ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న కురుబ కురుమ కులస్తులను చైతన్యం చేయాలని కర్నూల్ లో ఒక కార్యక్రమాన్ని నిర్వహించి రాష్ట్రంలో గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మన కులస్తులను కమిటీల ద్వారా చైతన్యం చేయాలని నిర్ణయం తీసుకున్నారు, అదే ప్రకారం రాష్ట్ర మొత్తం మండల కమిటీలు జిల్లా కమిటీలు నియోజకవర్గ కమిటీలు రెండు నెలల నుంచి వేసుకుంటూ వస్తున్నారు, ఈరోజు లికర్నూలు జిల్లా కురుబ సంఘ అధ్యక్షుడు కే మల్లికార్జునగారు మరియు ఆదోని నియోజకవర్గం నూతనంగా ఎన్నికైన కురువ రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఆదోని నియోజకవర్గం కమిటీని ఏర్పాటు చేసి యువతలను చైతన్యం పరిచినారు, ఈ కమిటీలో ఆదోని నియోజకవర్గం అధ్యక్షుడిగా కురువ రాఘవేంద్ర కురుబ సోదరులు సంతోషంగా ఎన్నుకున్నారు, అలాగే ఉపాధ్యక్షులు, కార్యదర్శిలు, కోశాధికారులు, సభ్యులు, సలహాదారులను, ఎన్నుకోవడం జరిగింది, ఈ కమిటీకి ముఖ్య అతిథిగా రాష్ట్ర కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప పాల్గొన్నారు, చైర్మన్ మాట్లాడుతూ కమిటీలు తీసుకోవడం ఒకటే కాదు కురువ కులస్తులను ఏకతాటిగా ఒకే దగ్గర చేరుస్తూ ముఖ్యంగా యువతను ప్రోత్సహిస్తూ చైతన్య పరంగా తీర్చిదిద్దాలని సూచించారు అలాగే కురుబ విద్యార్థులు విద్యను ఒక ఆయుధంగా మార్చుకొని చదువుకోని ఉన్నత స్థాయిలో ఉండాలని తన భావం వ్యక్తం చేశారు వచ్చే స్థానిక ఎలక్షన్లో మన కురుబలు ఎక్కడ పోటీ చేసిన కురుబలంత కలిసికట్టుగా గెలిపించుకోవాలని తెలిపారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఏపీలో పలు జిల్లాలకు వర్ష సూచన

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఆదివారం వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో పిడుగులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. అయితే, ఈ అల్పపీడనం ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై తక్కువగానే ఉంటుందని విపత్తు నిర్వహణ సంస్థ పేర్కొంది. ఉరుములు, పిడుగుల సమయంలో ప్రజలు చెట్ల కింద నిలబడకుండా, బహిరంగ ప్రదేశాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# కుమారుడు పుట్టినరోజు సందర్భంగా అనాధలకు అన్నదానం.





రుద్రవరం. పల్లె వెలుగు: తన కుమారుడు ఎం, రాజ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా అనాధలకు అన్నదానం చేసినట్లు రుద్రవరం మండలం నరసాపురం గ్రామానికి చెందిన ఎం సంజీవరాయుడు ( స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తన కుమారుడు పుట్టినరోజు సందర్భంగా అనాధలకు అన్నదానం చేయడం జరిగిందన్నారు. ఆళ్లగడ్డ లోని సత్య రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాధ ఆశ్రమంలో ఉన్న అనాధలు అందరికీ అన్నదానం చేయడం జరిగిందన్నారు. ఒక్కరోజు అనాధలకు అన్నదానం చేయడం ఎంతో సంతోషాన్నిచ్చిందని ఆయన తెలిపారు. అనాధలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సంజీవ రాయుడు భార్య ఓబులమ్మ, కుమార్తెలు శ్రావణి, అంజలి కుమారి, అల్లుళ్ళు ఆంజనేయులు, కుళాయి స్వామి మనవడు అక్షిత్, మనవరాలు అక్షర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గాజులపల్లెలో కొత్త బోరు మోటరు ఏర్పాటు




మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని ఒకటవ వార్డులో తాగునీరు మోటారు మరమ్మత్తులకు గురైంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం గాజులపల్లె టిడిపి నేత,గోపవరం సొసైటీ చైర్మన్ గంగవరపు ఉమామహేశ్వర్ రెడ్డి స్పందించి కొత్త మోటరును ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమయ్యే వసతులు కల్పించినప్పుడే పేద ప్రజలు సంతోషంగా ఉంటారని పేర్కొన్నారు. కొత్త బోరు మోటరు వేయించి ప్రజల నీటి సమస్యను తీర్చడంతో సొసైటీ చైర్మన్ కు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# పేకాటరాయుళ్లపై కేసు నమోదు

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 26: బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని బి కోడూరు గ్రామంలో దూదేకుల నాగరాజు తోపాటు మరో ఐదు మంది కే సి కెనాల్ కట్ట వద్ద పేకాట ఆడుతుండగా ఆదివారం సాయంత్రం వారిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఎస్ఐ జగన్మోహన్ పేర్కొన్నారు. వారి వద్ద 3,710 రూపాయలు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ పేర్కొన్నారు.

## విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నంద్యాల ప్రతినిధి. జూలై 26. (పల్లె వెలుగు ):నంద్యాల పట్టణంలోని భరతమాత టెంపుల్





వద్ద ఉన్న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు నగర అధ్యక్షురాలు సుహాసిని రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని టేక్కే భరతమాత టెంపుల్ వద్ద ఉన్న విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో నంద్యాల పట్టణంలోని ప్రమోద్ గ్యాస్ట్రో రివర్ సెంటర్ హాస్పటల్ వైద్యులు డాక్టర్ ఎస్ వి ప్రమోద్ రెడ్డి,డాక్టర్ శ్రీవాణి రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 200 మంది పైగా వైద్య సేవలు వినియోగించుకున్నారు. వీరికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సందీప్ ,శేష సాయి, డాక్టర్ లలిత కిషోర్ కుమార్, నాగిరెడ్డి, గురువయ్య ,శివారెడ్డి ,శివశంకర్, సముద్రాల మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.



## గంగమ్మదేవతకువర్షంకోసం

# బోనాలతో రజక మహిళలు చిన్నారులు

దొర్నిపాడు జులై 26 పల్లె వెలుగు న్యూస్ మండల కేంద్రమైన దొర్నిపాడు గ్రామానికి





చెందిన రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో వర్షం కోసం రజక మహిళలు, చిన్నారులు బోనాలతో అమ్మవారిని వేడుకుంటూ ఉపవాసంవుండి భక్తి శ్రద్ధలతో మేళా తాళలతో గంగమ్మ తల్లికిబోనాలు సమర్పిస్తూగంగమ్మ తల్లి మాకన్నీళ్లుచూచి చుక్క నీరు ఇవ్వమ్మఅని వేడుకున్నారు గంగమ్మదేవతకుసనాతన ఆచారం లో విశిష్టతఉంది. మహిళలు ఉదయం సంప్రదాయ దుస్తులతో ఉపవాసం ఉండి బోనాలకు పసుపు కుంకుమ, వేపాకులతో అలంక రించి పాలు, బెల్లం తో పరమాన్నం చేసి గగమ్మ తల్లి కీ నైవేద్యం కోసం. బోనాలను సిద్ధం చేస్తారు సిద్ధం చేసిన ఈ బోనాలను మహిళలు భక్తి తో తల పై పెట్టు కొని మేళా తా లాలతో. ప్రజలతో కలసి వర్షం కోసం గంగమ్మ దేవతను ప్రా ర్థి స్తూ. బోనాలు ఎక్కిస్తారు,ఈ సందర్భంగా నారాయణ, సుధాకర్,గుండ్రాతి సుబ్బయ్య లు మాట్లాడుతూ దొర్నిపాడు గ్రామంలొదాదాపు 150రజకకుటుంబాలుఉన్నాయి అన్నారుఎలినోవా ప్రభావం తో వర్షాలు పడక ప్రజలు పంటలు ఎండి పోయిచాలా ఇబ్బంది పడుతున్నారుఅన్నారు,గంగమ్మ దేవత కరుణించివర్షం కురుపించాలని150 రజక కుటుంబాల సభ్యులం 80మంది మహిళలు బోనాలుధరించిఆ గంగమ్మ తల్లికి భక్తి తో నైవేద్యం సమర్పించాము అన్నారు ఈ కార్య క్రమంలొరజక సంఘం పెద్దలు మహిళలు ప్రజలు పాల్గొన్నారు

# భారతీయ జనతా పార్టీ కార్యాలయంకు సహకరించిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు

**జిల్లా అధికార ప్రతినిధి దేశాయ్ గురు రాజ్,**




ఎమ్మిగనూరు పల్లె వెలుగు జులై 26 ఎమ్మిగనూరు పట్టణంలో భారతీయ జనతా పార్టి నూతన అసెంబ్లి కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా గత కొన్నిరోజుల నుండి రాత్రిశీబవళ్ళు కష్టపడి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యడానికి కృషి చేసిన బిజెపి నాయకులకు, కార్యకర్తలకు అలాగే దేశాయ్ నెట్వర్క్ బృందానికి మరియు బిజెపి మద్దతుదారులకు అందరికి పేరుపేరున కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము.

ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గురురాజ్ దేశాయ్ మాట్లాడుతూ ఈ అసెంబ్లి కార్యాలయం ఎమ్మిగనూరు నియొజకవర్గం యెక్క నాయకులు కార్యకర్తల దేవాలయం కాబట్టి ప్రతిఒక్కరు కలసికట్టుగా కృషి చేసి రాబొయే మునిసిపాలిటీ మరియు స్థానిక ఎన్నికలలో బిజెపి సత్తా ఎమిటో తెలియచేస్తూ కూటమి ధర్మాన్ని పాటిస్తూ పోటి చేసిన ప్రతి స్థానాలలోను విజయకేతనం ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

గతంలో మన బిజెపి రాష్ట్ర చీఫ్ గౌరవనీయులు మాధవ్ చెప్పినట్లుగా నాయకులు వస్తూంటారు పోతుంటారు కానీ కార్యకర్తనే శాశ్వతం అని చెప్పినట్లుగా పార్టిలో కష్టపడిన గల్లీ కార్యకర్త కూడ ఢిల్లీలో పదవులు సంపాదించే సంస్కృతి మన భారతీయ జనతా పార్టిలో మాత్రమే సాధ్యమని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సినియర్ నాయకులు బి ఎల్ నారాయణ మాజీ సర్పంచ్ రామన్న గౌడ్ , బిజెపి జిల్లా మహిలా మోర్చ ఉపాధ్యక్షులు పద్మావతి జిల్లా ఉపాధ్యక్షులు లోకేష్ ఎమ్మిగనూరు బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు సురేంద్ర పట్టణ అద్యక్షులు బంగి రాజేష్ , పట్టణ బిజెపి సినియర్ నాయకులు వడ్డే బజారి బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగనన్న కాలనీల్లో కరెంటు మీటర్ చార్జీల భారం..

## ఉచితంగా మీటర్లు ఇవ్వాలని లబ్ధిదారుల విజ్ఞప్తి




ఖాజీపేట, ప్రతినిధి జూలై 26: జగనన్న కాలనీల లబ్ధిదారులు కరెంటు మీటర్ల ధరలు పెరగడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణానికే అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్న తమపై ఇప్పుడు విద్యుత్ మీటర్ బిగించుకునేందుకు అధిక మొత్తంలో డబ్బు చెల్లించాల్సి రావడం మరింత భారంగా మారిందని వాపోతున్నారు. పేదల సంక్షేమం కోసం నిర్మించిన జగనన్న కాలనీల్లో నివసించే లబ్ధిదారులకు విద్యుత్ మీటర్లను పూర్తిగా ఉచితంగా అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పేద కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మీటర్ చార్జీలను రద్దు చేసి, ఉచితంగా మీటర్లు బిగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పెరిగిన మీటర్ చార్జీల కారణంగా అనేక మంది లబ్ధిదారులు విద్యుత్ కనెక్షన్ తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి పేదలపై పడుతున్న ఈ అదనపు భారాన్ని తొలగించాలని వారు కోరుతున్నారు.

# క్రీడలతో జర్నలిస్టులకు ఆరోగ్య రక్షణ

**-ఏపీజెఎస్ఏ కప్ విజేత తెలంగాణా -రన్నర్ అప్ కడప జట్టు**









విజయవాడ, బ్యూరో చీఫ్ జులై 26: పల్లె వెలుగు విధి నిర్వహణలో నిత్యం వత్తిడిని ఎదుర్కొనే జర్నలిస్టులకు క్రీడలు ఆరోగ్య రక్షణ కల్పిస్తాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ లయోలా విద్యా సంస్థల గ్రౌండ్స్ లో రెండు రోజుల పాటు జరిగిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం సాయంత్రం ముగిసింది. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల జట్లతో పాటు తెలంగాణ జట్టు కూడా పాల్గొన్న ఈ పోటీలో తెలంగాణా, కడప జట్ల మధ్య ఆదివారం సాయంత్రం ఫైనల్ పోటీ జరిగింది. ఉత్కంఠభరితంగా జరిగిన ఈ పోటీలో తెలంగాణా జట్టు విజేతగా నిలిచింది. కడప రన్నర్ అప్ గా నిలిచింది. విజేతలకు జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బోళ్ళ సతీష్ బాబు, రాష్ట్ర అధ్యక్షులు ఓబులం ప్రసాద్, విజయవాడ వెలగలేటి భార్గవ రాయుడు, బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు ఉపద్రష్ట నాగార్జున బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ నాయకులు తలారి నాగలింగస్వామి, సురేంద్ర, వనిత శ్రీనివాస్, పిట్టం నాగవర్ధన్ రెడ్డి, ఓబుళంపల్లి రామకృష్ణ, రెడ్డప్ప, పీతల అప్పాజీ, వి. రవికుమార్, ఎస్. కె. మున్ని, శ్రీకాంత్, సురేంద్ర, తెలంగాణా అసోసియేషన్ నాయకులు మానుకొండ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.వెలగలేటి భార్గవ రాయుడు, బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు ఉపద్రష్ట నాగార్జున బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ నాయకులు తలారి నాగలింగస్వామి, సురేంద్ర, వనిత శ్రీనివాస్, పిట్టం నాగవర్ధన్ రెడ్డి, ఓబుళంపల్లి రామకృష్ణ, రెడ్డప్ప, పీతల అప్పాజీ, వి. రవికుమార్, ఎస్. కె. మున్ని, శ్రీకాంత్, సురేంద్ర, తెలంగాణా అసోసియేషన్ నాయకులు మానుకొండ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

----------------------------------------

## అనారోగ్యంతో చికిత్స పొంది విశ్రాంతిలో

# రిటైర్డ్ టీచర్ చేనేత మునెప్ప ని పరామర్శించిన,

**బుట్టా శివ నీలకంఠ ,**





గోనెగండ్ల, పల్లె వెలుగు జూలై 26 గోనెగండ్ల మండల కేంద్రంలోని వివర్స్ కాలనీలో నివాసముంటున్న రిటైర్డ్ టీచర్, చేనేత రంగ పెద్దలు చేనేత మునెప్ప అనారోగ్యంతో చికిత్స పొంది స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ పార్లమెంట్ సభ్యురాలు బుట్టా రేణుక భర్త, బుట్టా ఫౌండేషన్ అధినేత శ్రీ బుట్టా శివ నీలకంఠ గారు వారి నివాసానికి వెళ్లి ఆప్యాయంగా పరామర్శించారు. ఈ సందర్భంగా చేనేత మునెప్ప ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న బుట్టా శివ నీలకంఠ, ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని యథావిధిగా ప్రజల మధ్య ఉండాలని ఆకాంక్షించారు. ధైర్యంగా ఉండాలని, వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచిస్తూ, అవసరమైన ప్రతి సందర్భంలో తాము అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా బుట్టా శివ నీలకంఠ మాట్లాడుతూ, విద్యా రంగంలో ఉపాధ్యాయుడిగా, చేనేత వర్గానికి చెందిన పెద్దగా శ్రీ చేనేత మునెప్ప అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని, అలాంటి సేవామూర్తులు అనారోగ్యానికి గురైనప్పుడు వారిని పరామర్శించి మనోధైర్యం కల్పించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.బి ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం, అవసరమైన సమయంలో వారికి భరోసా కల్పించడం బుట్టా ఫౌండేషన్ ఎల్లప్పుడూ పాటిస్తున్న మానవతా దృక్పథమని ఆయన తెలిపారు. సమాజానికి సేవలందించిన పెద్దలను గౌరవించడం భారతీయ సంస్కృతికి ప్రతీక అని, వారి ఆశీర్వాదాలు సమాజానికి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు.బి ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ కె.ఆర్. రామకోటేశ్వర్ రెడ్డి , నందవరం మండల కన్వీనర్ జె. శివారెడ్డి గౌడ్ , బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరూపాక్షి రెడ్డి సాంస్కృతిక విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాశి రెడ్డి , నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు డి. నజీర్ అహ్మద్ చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు ఎం.కె. శివప్రసాద్ , బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు వాల్మీకి దొరబాబు నాయుడు నాయకులు లింగందిన్నె రామ్ మోహన్ రెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణుడిని సాక్షిగా యాదవుల సామూహిక ప్రమాణ స్వీకారం

**-"జై యాదవ్... జై జై యాదవ్" నినాదాలతో మార్మోగిన అఖిల భారత యాదవ మహాసంఘం ఉమ్మడి కడప జిల్లా సమావేశం**



కడప, జూలై 26 :-అఖిల భారత యాదవ మహాసంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా యాదవుల సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి యాదవ సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువత, సభ్యులు పెద్ద సంఖ్యలో ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో యాదవ కులదైవం శ్రీకృష్ణ భగవానుడిని సాక్షిగా యాదవులందరూ చేతులు పైకెత్తి సామూహికంగా ప్రమాణ స్వీకారం చేశారు. యాదవ సమాజ ఐక్యత, అభివృద్ధి, హక్కుల పరిరక్షణ, సంఘ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సభా ప్రాంగణం "జై యాదవ్... జై జై యాదవ్" నినాదాలతో మార్మోగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యాదవులంతా కుల ఐక్యతను చాటుతూ సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. యువత సంఘ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజ సేవలో ముందుండాలని సూచించారు. యాదవుల హక్కుల సాధన, సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధే మహాసంఘం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశానికి అఖిల భారత యాదవ మహాసంఘం జాతీయ అధ్యక్షులు బుసగాని లక్ష్మయ్య యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు ఉప్పుటూరు పేరయ్య యాదవ్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ బోడ్డు రమేష్ యాదవ్, స్టేట్ పొలిటికల్ సెక్రటరీ గగోరిపత్రి శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాదేవి గంగయ్య యాదవ్, తిరుపతి జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు వాసుదేవా యాదవ్, కడప జిల్లా అధ్యక్షులు రెడ్డి యాదవ్, చిత్తూరు జిల్లా అధ్యక్షులు నవీన్ యాదవ్తో పాటు ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల యాదవ సంఘ నాయకులు, మహిళలు, యువకులు, సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం సంఘ బలోపేతానికి సంబంధించిన పలు తీర్మానాలను ఆమోదిస్తూ, రానున్న రోజుల్లో యాదవుల సంక్షేమం, ఐక్యత, హక్కుల సాధన కోసం సమిష్టిగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## యథావిధిగా కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్

రాజమహేంద్రవరం, జూలై 26 పల్లె వెలుగు:- ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత,



జవాబుదారీతనాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ లో భాగంగా జులై 27న జిల్లా కలెక్టరేట్‌తో పాటు క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్, మీకోసం ద్వారా సేవలు పొందిన ఫిర్యాదుదారులు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాలను నేరుగా ప్రభుత్వానికి తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ఈ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. జిల్లా పీజీఆర్ఎస్ నోడల్ అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) వ్యవహరిస్తున్నారని చెప్పారు. తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లో క్షేత్రస్థాయిలో, అలాగే బొమ్మూరులోని జిల్లా కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. 1100 టోల్‌ఫ్రీ నంబర్, మీకోసం వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని వివరించారు. అలాగే 9552300009 వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 300కు పైగా పౌర సేవలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు

## ఆగస్టు 1న భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభం



జగ్గంపేట, జూలై 26 (పల్లె వెలుగు దినపత్రిక) :- భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి జామి మండలం నుంచి ప్రజలు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లనున్నట్లు అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు, శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని జామి మండల అబ్జర్వర్ పాలచర్ల నాగేంద్ర చౌదరి తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి, కూటమి ప్రభుత్వం మరియు కేంద్ర మంత్రుల సమన్వయంతో భోగాపురం ప్రాజెక్టు రూపుదిద్దుకుందని చెప్పారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా ఉత్తరాంధ్ర అభివృద్ధి, ఉపాధి, పెట్టుబడులకు కొత్త ద్వారాలు తెరుచుకుంటాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలికేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు పాలచర్ల నాగేంద్ర చౌదరి వివరించారు. జామి మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశమై విస్తృత జన సమీకరణ ప్రణాళికను ఖరారు చేసినట్లు తెలిపారు. పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక వేడుకను విజయవంతం చేసేందుకు కూటమి శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు

## భోగాపురం సభను విజయవంతం చేద్దాం : జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, జూలై 26 (పల్లె వెలుగుదినపత్రిక) :- ఆగస్టు 1న జరగనున్న భోగాపురం



అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవం మరియు ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు నర్సీపట్నం నియోజకవర్గం నుంచి రెండు వేల మందితో తరలివెళ్లి విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు, నర్సీపట్నం నియోజకవర్గ పరిశీలకులు, జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. నర్సీపట్నం టీడీపీ కార్యాలయంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల రాజేష్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్తశుద్ధితోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్రకు వరం లాంటిదని, దీనివల్ల ఉపాధి, పారిశ్రామిక పెట్టుబడులు, పర్యాటకం గణనీయంగా పెరుగుతాయని వివరించారు. ఈ చారిత్రాత్మక వేడుకను జయప్రదం చేసేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో నర్సీపట్నం నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకులు, మండల నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## సీనియర్ నాయకులు, చెల్లారావును పరామర్శించిన జ్యోతుల నవీన్



కిర్లంపూడి, జూలై 26 (పల్లె వెలుగు, దినపత్రిక) :- కిర్లంపూడి మండలం వేలంక గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఇంటి చెల్లారావును కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై శస్త్రచికిత్స అనంతరం ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న చెల్లారావు నివాసానికి వెళ్లిన జ్యోతుల నవీన్ ఆయన ఆరోగ్య పరిస్థితులను, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతుల నవీన్ వెంట నాయకులు వీరంరెడ్డి కాశి బాబు, బుర్రి సత్తిబాబు, నీలం శ్రీను, తూము కుమార్, గండే చెల్లారావు, బేతాళ బాబ్జి, ఉప్పు కృష్ణ, గండే గోపి తదితరులు పాల్గొన్నారు

## ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి పీటీఎస్ అసోసియేషన్ ఘన సత్కారం

రాజమండ్రి, జూలై 26 పల్లె వెలుగు :- స్థానిక







గణేష్ చౌక్ లో ఉన్న ప్రెస్ క్లబ్ భవనంలో ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని పేరెంట్స్ టీచర్స్ స్టూడెంట్స్ అసోసియేషన్ (పీటీఎస్) ఘనంగా సత్కరించింది. అసోసియేషన్ ప్రతినిధి కొల్లపు వేణు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రెస్ క్లబ్ ఎన్నికలలో విజయం సాధించిన మోతా బాల విజయ సారథి, గంద్రుతు వేణుగోపాలస్వామి మరియు ఇతర కార్యవర్గ సభ్యులకు పీటీఎస్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎంతో పేరుగాంచిన ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ కు ప్రస్తుత కార్యవర్గం మరింత కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కొల్లపు వేణు ఆకాంక్షించారు. జర్నలిస్టుల సంక్షేమం, ప్రెస్ క్లబ్ అభివృద్ధికి నూతన కార్యవర్గం శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరుతూ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులతో పాటు కోశాధికారి పురుషోత్తం కుమార్, ఉపాధ్యక్షుడు పిఎస్ గంగాధర్, సంయుక్త కార్యదర్శులు ఎస్ కృపానందం, జి న్యూస్ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు ఆకుల ఈశ్వర్, కొట్టె మధు, ఆర్ వి వి సత్యనారాయణ, పాలపర్తి శ్రీనివాస్, గోపాలకృష్ణ, చంటి లను పీటీఎస్ఎఫ్ నేతలు ఘనంగా సత్కరించారు. సత్కరించిన వారిలో పీటీఎస్ఎఫ్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మీ. వేణు గోపాల్ రావు, స్టేట్ లీగల్ సెల్ సెక్రటరీ చిట్టూరి సంధ్య చౌదరి, విమెన్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ ఎన్. భవాని శ్రీనివాస్, టీచర్స్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ ఉమా మన్నే, స్టేట్ సెక్రటరీ అర్థాల కుమార్ బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు నక్కా వెంకటరత్నం రాజు, ఎస్.కే. హసీనా, వైస్ ప్రెసిడెంట్ సీహెచ్. సత్యనారాయణ రాజు, జాయింట్ సెక్రటరీ పి. వనజ, ఈసీ మెంబర్లు డి. రమణ కుమారి, వై. మీనాక్షి రెడ్డి, మరియు ఏ. పి. నాయుడు, నల్లా శ్రీనివాస్ రావు చౌదరి, బి. రామకృష్ణ, బండారు లీలావతి, జానకి ఉన్నారు

## వ్యవస్థాపకత మరియు ఉపాధి

(ఎస్.ఎం. బాషా, సీనియర్ జర్నలిస్ట్)



హైదరాబాద్, జూలై 26 (పల్లె వెలుగు దినపత్రిక) :- భారతీయ గ్రామీణ కుటుంబాల రెమిటెన్సులు అంటే, విదేశాలలో నివసిస్తున్న ప్రజలు తమ స్వదేశంలోని కుటుంబ సభ్యులకు పంపే డబ్బు బదిలీలు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో, అంతర్జాతీయ సహాయంతో మాత్రమే పోటీపడే అతిపెద్ద ఆర్థిక ప్రవాహాలలో ఒకటిగా ఈ బదిలీలు అపారమైన ప్రభావాన్ని చూపుతాయి. వలసదారులు తమ మాతృదేశాలకు పంపే రెమిటెన్సులు కేవలం ఆర్థిక లావాదేవీల కన్నా ఎక్కువే - అవి లక్షలాది కుటుంబాలకు జీవనాధారం, ఆర్థిక సాధికారతకు ఉత్ప్రేరకం, మరియు సుస్థిర అభివృద్ధికి కీలక చోదకం. అత్యధిక రెమిటెన్సులు మెక్సికో, చైనా, భారతదేశం, ఫిలిప్పీన్స్, వియత్నాం వంటి దేశాలకు వెళ్తాయి. ఒక బిలియన్ వలసదారులు - 500 బిలియన్ల రెమిటెన్సులు : ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా సుమారు 1 బిలియన్ వలసదారులు ఉన్నారు, వీరిలో 25.8 కోట్ల మంది అంతర్జాతీయ వలసదారులు. అదనంగా, 7.6 కోట్లకు పైగా దేశీయ వలసదారులు ఉన్నారు. సుమారు 20 కోట్ల మంది తమ స్వదేశంలోని కుటుంబాల జీవితాలను మెరుగుపరచడానికి వలస వెళ్తారు. ఈ వలసదారులు 8 కోట్ల మంది కుటుంబ సభ్యులకు సహాయం చేస్తారు. వలసదారులు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం డబ్బు పంపుతారు. ఈ డబ్బు ద్వారా వలసదారులు జీవనోపాధి, విద్య, ఆహారం, ఆరోగ్యం, గృహవసతికి మద్దతునిస్తూ, ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేస్తూ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు (ఎస్‌డీజీలు) నేరుగా దోహదపడుతున్నారు. అంతర్జాతీయ కుటుంబ రెమిటెన్స్ దినోత్సవం-2026 యొక్క ఇతివృత్తం "గ్రామీణ స్థితిస్థాపకత, వ్యవస్థాపకత మరియు ఉపాధి కోసం రెమిటెన్స్‌లు". ఇది పేదరికం, వాతావరణ మార్పుల దుర్బలత్వం మరియు పరిమిత ఆర్థిక అవకాశాలు తరచుగా ముడిపడి ఉండే గ్రామీణ ప్రాంతాలలో రెమిటెన్స్ ప్రవాహం యొక్క పరివర్తనాత్మక ప్రభావాన్ని హైలైట్ చేస్తుంది. కుటుంబ రెమిటెన్స్‌ల ప్రయోజనాలు/సానుకూల ప్రభావాలు : ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం జూన్ 16న పాటించే అంతర్జాతీయ కుటుంబ రెమిటెన్స్ దినోత్సవం, వలస కార్మికుల కృషిని గుర్తిస్తుంది మరియు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది జీవనోపాధిని మెరుగుపరచడంలో రెమిటెన్స్‌లు పోషించే కీలక పాత్రను హైలైట్ చేస్తుంది. సుస్థిర అభివృద్ధి కోసం ఆర్థిక అంతరాన్ని తగ్గించడంలో రెమిటెన్స్‌లు కీలక సాధనాలని, వాటిపై మరింత అవగాహన కల్పించాలని ఈ సంవత్సరం ప్రచారం పిలుపునిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఎనిమిది మందిలో ఒకరిపై రెమిటెన్సులు ప్రభావం చూపుతాయి, అవి స్థిరమైనవి, చిన్నవైనా శక్తివంతమైనవి, జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయి, దీర్ఘకాలిక వృద్ధిని చూపుతాయి, గ్రామీణ ప్రాంతాలకు జీవనాధారం, పేదరికాన్ని తగ్గిస్తాయి, అవకాశాలను పెంచుతాయి, ఆన్‌లైన్‌లోకి మారే సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను (ఎస్‌డీజీలు) ముందుకు నడిపిస్తాయి, ఆర్థిక సమ్మిళితాన్ని వేగవంతం చేస్తాయి, వాతావరణ మార్పులకు అనుగుణంగా మారడాన్ని ప్రోత్సహిస్తాయి, మరియు భాగస్వామ్యాలతో ఇవి అత్యంత ప్రభావవంతంగా ఉంటాయి. ఈ కారణాల వల్లే రెమిటెన్సులు అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంటాయి. గత దశాబ్ద కాలంలో, వలసదారులు తక్కువ మరియు మధ్య-ఆదాయ దేశాలకు, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు 5 ట్రిలియన్ (500 బిలియన్) అమెరికన్ డాలర్ల రెమిటెన్సులను పంపారు

## భాష్యం స్కూల్ పిఠాపురం శాఖలో ఘనంగా పేరెంట్స్ డే వేడుకలు

పిఠాపురం, జూలై 26(పల్లె వెలుగు దినపత్రిక)





పిఠాపురం పట్టణం భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలను విద్యార్థుల్లో పెంపొందించాలనే లక్ష్యంతో భాష్యం స్కూల్, పిఠాపురం శాఖ ఆధ్వర్యంలో పేరెంట్స్ డే వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఎల్.కె.జీ నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు సుమారుగా 200 మంది తమ తల్లిదండ్రులకు సంప్రదాయబద్ధంగా పాదపూజ నిర్వహించి వారి ఆశీర్వాదాలు పొందారు. తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞత, గౌరవం, వినయం వంటి విలువలను చిన్ననాటి నుంచే అలవర్చే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, గేయాలు, సందేశాత్మక ప్రదర్శనలు తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే తల్లిదండ్రుల కోసం వివిధ ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ బి. సాకేత్ రామ్ తమ శుభాకాంక్షలు తెలియజేస్తూ, విద్యార్థులు విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, తల్లిదండ్రుల పట్ల గౌరవాన్ని అలవరచుకోవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు భాష్యం విద్యాసంస్థలు విద్యతో పాటు భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలకు ప్రాధాన్యత ఇస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్-1 ఆ ఈస్ట్-4 జడ్ఈఓ వి. గోవిందరాజు, పి. వేణు, జడ్సిఓ బి. సునీత, ప్రిన్సిపాల్ అంజి రెడ్డి, ప్రైమరీ హెడ్‌మిస్ట్రెస్ అరుణ మరియు టీమ్ భాష్యం విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్ర షిర్డీ లో విజయవాడ ఇంటెలిజెన్స్ ఎస్పీ కె. శ్రీనివాస్ కుటుంబ సమేతంగా సాయిబాబా దర్శనం

అనపర్తినియోజకవం



ప్రతినిధి:కర్రిదుర్గారెడ్డి,(పల్లె వెలుగు)బలభద్రపురం, జూలై 26: తూర్పు గోదావరి జిల్లా అనపర్తి నియజికవర్గం బిక్కవోలు మండలం



బలభద్రపురంలో ఆంధ్ర షిర్డీగా ప్రసిద్ధి చెందిన శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయాన్ని విజయవాడ ఇంటెలిజెన్స్ ఎస్పీ కె. శ్రీనివాస్ కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించి శ్రీ సాయిబాబా వారి ప్రత్యేక దర్శనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎస్పీ కె. శ్రీనివాస్ కుటుంబానికి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించి, సాయిబాబా వారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందించి బాబా వారి ఆశీర్వాదాలు అందించారు. ఆంధ్ర షిర్డీగా భక్తుల విశ్వాసాన్ని చూరగొన్న ఈ పుణ్యక్షేత్రంలో ఎస్పీ కుటుంబం ప్రత్యేక పూజల్లో పాల్గొని దేశ ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, సాయిబాబా వారి అనుగ్రహం ఎల్లప్పుడూ ఎస్పీ కె. శ్రీనివాస్ కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Palleveluguneews9@gmail.com